
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 మే 2025 | 8 పేజీలు




ఏలూరు | పశ్చిమ గోదావరి

ఫారెస్టు అధికారుల.. కర్కశత్వం..!

- వరి రైతుల పట్ల జాలి, దయలేని అధికారులు
- పెదనింద్రకొలనులో ఏడెకరాల పంటను నీట ముంచిన అధికారులు
- రెండు రోజులు గడువివ్వాలని రైతు వేడుకున్నా వినకుండా చేపల చెరువుకు గండి
- కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఉపాధి పనులు చేయొద్దంటూ హుకుం
- పంట కాలువలు బాగు చేయకుండా తీవ్ర అడ్డంకులు
- మామూళ్ల కోసం తమను ఇబ్బంది పెడుతున్నారంటూ రైతుల ఆవేదన
- మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన కరువు



చేపల చెరువుకు గండికొట్టడంతో కోతకొచ్చిన వరి పొలంలోకి చేరిన నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా ఫారెస్ట్ అధికారుల కాఠిన్యం తీవ్రస్థాయికి చేరింది. అన్నం పెట్టే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ వికట్టహాసం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడమర్రు మండలానికి చెందిన రైతులు రెండు రోజులు గడువు ఇవ్వాలని వేడుకున్నా వినకుండా ఆరుగాలం పండించిన వరి పంటను ఉద్దేశపూర్వకంగానే ముంపునకు గురిచేయడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల నెపంతో గత కొంతకాలంగా కొల్లేరులోని ఐదో కాంటూరు పరిధిలోని చేపల చెరువులకు ఫారెస్ట్ అధికారులు గండికొడుతున్నారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనుకు చెందిన రైతు సానబోయిన సుబ్బాయమ్మ కుటుంబం ఏడెకరాల పొలం సాగు చేసింది. ఈ భూమి ఇ-క్రాప్‌లో నమోదైన పట్టాభూమి. పంట పక్వానికి రావడంతో ఒకటి, రెండురోజుల్లో మాసూళ్లు చేయడానికి సుబ్బాయమ్మ కుటుంబం సిద్ధమైంది. పొలానికి సమీపంలో ఉన్న చేపల చెరువుకు గండికొట్టేందుకు ఫారెస్ట్ అధికారులు సిద్ధమయ్యారు. చెరువుకు గండికొడితే తమ పొలంలో పంట మునిగిపోతుందని, రెండు రోజులు సమయం ఇస్తే పంట మాసూళ్లు చేసేస్తానని రైతులు ఫారెస్ట్ అధికారులను వేడుకున్నారు. ఫారెస్ట్ అధికారులు అంగీకరించినట్లు మాట్లాడటంతో రైతు ఇంటికి వచ్చేశాడు. రైతు వచ్చేసిన తర్వాత చెరువుకు గండికొట్టడంతో పంట పొలం మొత్తం మునిగిపోయింది. ఏడెకరాల్లో పంట ఎందుకూ పనికిరాకుండా పోయింది. రైతు ఎకరానికి రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టాడు. ఎకరాకు 50 బస్తాలకుపైగా దిగుబడి వచ్చే పొలాన్ని ఎందుకూ పనికిరాకుండా ఫారెస్ట్ అధికారులు చేసేశారు. అన్నం పెట్టే రైతు పట్ల ఫారెస్ట్ అధికారులు ఇంత కర్కశంగా ఎలా వ్యవహరించారో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల తవ్వకాలకు ఫారెస్టు అధికారులే పూర్తి సహాయ సహకారాలు అందించారు. అప్పట్లో మీడియాలో ఎన్ని కథనాలు వచ్చినా మామూళ్లు తీసుకుని బడాబాబులకు కొమ్ముకాశారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో మరోసారి మామూళ్లు దండుకుంటూ వారికి నచ్చిన చోట ఒకలా.. నచ్చనిచోట మరోలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడమర్రు మండలానికి చెందిన రైతులు మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి ఫారెస్ట్ అధికారుల ..6లో

ప్రశాంతంగా పాలిసెట్

ఏలూరు జిల్లాలో 598 మంది, పశ్చిమలో 782 మంది గైర్హాజరు

పశ్చిమలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



ఏలూరు: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు జిల్లాలో పాలిసెట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్ష ఏలూరులోని 10 కేంద్రాల్లో, నూజివీడులో రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్షకు మొత్తం 4,312 మంది దరఖాస్తు చేయగా 3,714 మంది హాజరయ్యారు. 598 మంది గైర్హాజరయ్యారు. ఏలూరులోని పది కేంద్రాల్లో 3,541 ..6లో



బాధితులతో కలిసి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ఎఎస్ఆర్ నగర్ వాసులకు..

రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

పాలకోడేరు :అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 150 చదరపు గజాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తామన్న ఆదేశాలను పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో పేదల ఇళ్లకు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎఎస్ఆర్.నగర్ నిర్వాసితులకు సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా ..6లో

మేడే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి -నిడమర్రు

బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను కార్మికులంతా వ్యతిరేకించాలని, వాటిని చేసే వరకు పోరాడాలని, కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. నిడమర్రులో బుధవారం నిర్వహించిన అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ (సిఐటియు) సమావేశంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎ.నాగమణి, కె.జయమ్మ. సుభాషిణి, రాధా, వెంకటలక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, జానకి, రసూల్ పాల్గొన్నారు.

కుక్కునూరు :కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న మేడేలో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మేడేను జయప్రదం కోరుతూ బుధవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ దేశంలో మేడే స్ఫూర్తితో పోరాడి అనేక చట్టాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి బాడిస సుజాత, సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, పోచారపు వెంకటేశ్వర్లు, మెడవరపు రమాదేవి, ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా, నాయకులు అన్నపూర్ణ, మంగ, స్రవంతి, అలివేలు, కుమారి, పున్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : మేడేను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సిపిఎం కార్యకర్తలకు, నాయకులకు పార్టీ జెండాలు, సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడేను జయప్రదం చేయాలని కోరారు.

వేసవి విజ్ఞాన తరగతులతో విద్యా నైపుణ్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

వేసవి విజ్ఞాన తరగతుల ద్వారా విద్యార్థుల్లో విద్యా నైపుణ్యం పెంపొందుతుందని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు జాతీయ గీతాల పోటీలు నిర్వహించారు. .

పది ఫెయిల్ అయినవారికి వేసవి శిక్షణా తరగతులు

ముసునూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఏయే సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చాయో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో బోధించి ఎక్కువ మార్కులు వచ్చేలా తర్ఫీదు ఇస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

హెచ్ఆర్‌పిసిపి స్టేట్ సెక్రటరీగా నాగేశ్వరరావు

ఉంగుటూరు :హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ సంస్థ (హెచ్ఆర్‌పిసిపి) రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన మెండ్యాల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. నారాయణపురం రైతు కళ్యాణ మండపం లో ఆ సంస్థ ఫౌండర్ చైర్మన్ జ్ఞానసుందరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరావును స్టేట్ సెక్రటరీగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

బాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రవికుమార్

ఆగిరిపల్లి :భారతీయ అంబేద్కర్ సేన(బాస్)రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఆగిరిపల్లికి చెందిన వంగా రవికుమార్ నియమితులయ్యారు. ఈ నెల 27న విశాఖపట్నంలో జరిగిన భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో బాస్ వ్యవస్థాపకులు పిటిఎం.శివప్రసాద్ చేతులమీదుగా ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు.

బెట్టింగులకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - చింతలపూడి

బెట్టింగ్‌కు బానిసలవుతున్న వారిని గుర్తించి వారికి మానసిక మద్దతు, సలహాలు అందించేందుకు పోలీస్ శాఖ సన్నద్ధంగా ఉందని చింతలపూడి సిఐ సిహెచ్.రాజశేఖర్, ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. పట్టణంలో బెట్టింగ్‌ల వల్ల కలిగే అనర్థాల గురించి చింతలపూడిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల భద్రతకు నిబంధనల ఆచరణకు చింతలపూడి పోలీస్ అధికారులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

ఘనంగా మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుక

ప్రజాశక్తి - చింతలపూడి

మహాకవి శ్రీ శ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక కవిత్వానికి మార్గదర్శకంగా నిలిచిందని, మార్క్సిజం, కమ్యూనిజం వంటి భావజాలాలపై ప్రభావితమై, సామాజిక అసమానతలను ప్రశ్నించే విధంగా రచనలు చేశారని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకను పురస్కరించుకుని శ్రీనివాసరావు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, తెలుగు శాఖాధిపతి డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడారు.

త్రినాధరావుకు ఉద్యోగ విరమణ సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా పబ్లిక్ హెల్త్ లేబరేటరీలో సీనియర్ అనలిస్టుగా పనిచేస్తున్న బి.త్రినాధరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఏలూరులోని కోట దిబ్బవద్ద ఉన్న జిల్లా పబ్లిక్ హెల్త్ లేబరేటరీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ త్రినాధరావు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సహ ఉద్యోగులు, నగరపాలక సంస్థ ఉద్యోగులు, ఫుడ్ కార్పొరేషన్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శాలువాలను కప్పి సన్మానం చేశారు. అనంతరం త్రినాధరావు మాట్లాడుతూ తనను ఇంతగా అభిమానిస్తున్న తోటి ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఇన్ని సంవత్సరాల్లో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా పని చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **YAJJALA RATNA RAJU** S/o Abraham Ratna Raju, D.No.18-1-107/1, Stationpeta, Narasapuram - 534275, W.G.Dt. A.P. I have changed my name from **YEJHALA RATNA RAJU** (Old name) to **YAJJALA RATNA RAJU** (New name) hence forth I am being called **YAJJALA RATNA RAJU** S/o Abraham Ratna Raju, for all purposes.

CHANGE OF NAME

I, **YAJJALA JESSY RANI** W/o Yajjala, Ratna Raju, D.No.18-1-107/1, Stationpeta, Narasapuram - 534275, W.G.Dt. A.P. I have changed my name from **JANIFA YEJHALA RTNA RAJU** (Old name) to **YAJJALA JESSY RANI** (New name) hence forth I am being called **YAJJALA JESSY RANI** W/o Yajjala Ratna Raju for all purposes.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం గణపవరం గ్రామ కాపురస్తులైన కొండ్రు శీను తండ్రి: ఆనందరావు అను నేను నా యొక్క దస్తావేజులు (SRO గణపవరం) గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఒరిజినల్ దస్తావేజు నెంబర్లు 1) 2367/1951 ఒరిజినల దస్తావేజు మరియు జిరాక్స్ తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్ కు తెలియజేయవలసినది.

కొండ్రు శీను
S/o. ఆనందరావు
గణపవరం గ్రామం
గణపవరం మండలం, ప॥గో॥జిల్లా
సెల్: 78160 92396

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, అయినపర్రు గ్రామానికి చెందిన పరిమి గణేష్ తండ్రి: వెంకటరమణ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది.ఇరగవరం మండలం అయినపర్రు ఇంటి దగ్గర నుండి పెనుగొండ వస్తుండగ నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **X0602972** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

పరిమి గణేష్
తండ్రి: వెంకటరమణ
డోరు నెం. 1-153, అయినపర్రు
ఇరగవరం మండలం, ప॥గో॥ జిల్లా,
సెల్ నెం: 96526 14909

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 37/2022

Between:

M/s Usha Bala Chits(P) Ltd. N.R.Pet, Eluru.
Represented by its Forman/Manager
Sri P. Kalyana Chakravarthy **...Disputant**

And

Smt. Kaza Dhana Lakshmi & others **... Opponents**

Opponent No.3: Sri Vemula Manda Vijaya Kumar Raju S/o. Chinna Venkta Raju, Hindu, Male, Aged 41 Years. Junior Assistant ,Superitendent of Engineer (Civil) Eluru, Eluru Dist.

పైన ఉదహరించి డిస్పూటెంట్ చిట్ ఫండ్ కంపెనీవారు వారి చీటి బాకీ రాబట్టుకొనే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా గ్రంధములో పై అధారిటీ వారు మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంధము **ది.27-05-2025వ సం॥రం తేదిన** వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు అనగా **ది.27-05-2025వ సం॥రం తేదిన ఉదయం 11-00 గంటలకు** డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ జిల్లా రిజిస్ట్రారు గారి కార్యాలయం ఏలూరు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైన ఉన్నయెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు:
For Usha Bala Chits (P) Ltd.
ఏలూరు **P. Kalyana Chakravarthy**
తేది:28-04-2025 Fore Man,

(డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 35/2024

Between:

M/s Usha Bala Chits(P) Ltd. N.R.Pet, Eluru.
Represented by its Forman/Manager
Sri P. Kalyana Chakravarthy **...Disputant**

And

Sri Marlapudi Srinivasarao & others **... Opponents**

Opponent No.1: Sri Marlapudi Srinivasarao S/o. Raghavulu, Hindu, Male, Aged 44 Years. Senior Assistant 19th Andhra BN NCC KSR Thota, Eluru, Eluru Dist.

పైన ఉదహరించి డిస్పూటెంట్ చిట్ ఫండ్ కంపెనీవారు వారి చీటి బాకీ రాబట్టుకొనే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా గ్రంధములో పై అధారిటీ వారు మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంధము **ది.27-05-2025వ సం॥రం తేదిన** వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు అనగా **ది.27-05-2025వ సం॥రం తేదిన ఉదయం 11-00 గంటలకు** డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ జిల్లా రిజిస్ట్రారు గారి కార్యాలయం ఏలూరు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైన ఉన్నయెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు:
For Usha Bala Chits (P) Ltd.
ఏలూరు **P. Kalyana Chakravarthy**
తేది:28-04-2025 Fore Man,

(డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 36/2024

Between:

M/s Usha Bala Chits(P) Ltd. N.R.Pet, Eluru.
Represented by its Forman/Manager
Sri P. Kalyana Chakravarthy **...Disputant**

And

Smt. Mamuduri Usha Rani & others **... Opponents**

Opponent No.3: Sri Koppisetti Lakshmi Venkata Narayana, S/o. Surya Narayana, Hindu, Male, Aged 50 Years. GST Officer, O/O Joint Commissioner (ST) Commercial Taxes,Department, Eluru Division, Eluru, Eluru Dist.

పైన ఉదహరించి డిస్పూటెంట్ చిట్ ఫండ్ కంపెనీవారు వారి చీటి బాకీ రాబట్టుకొనే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా గ్రంధములో పై అధారిటీ వారు మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంధము **ది.27-05-2025వ సం॥రం తేదిన** వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు అనగా **ది.27-05-2025వ సం॥రం తేదిన ఉదయం 11-00 గంటలకు** డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ జిల్లా రిజిస్ట్రారు గారి కార్యాలయం ఏలూరు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైన ఉన్నయెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు:
For Usha Bala Chits (P) Ltd.
ఏలూరు **P. Kalyana Chakravarthy**
తేది:28-04-2025 Fore Man,

(డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 35/2022

Between:

M/s Usha Bala Chits(P) Ltd. N.R.Pet, Eluru.
Represented by its Forman/Manager
Sri P. Kalyana Chakravarthy **...Disputant**

And

Sri Veeravasarapu Naga Satya Kiran Kumar & others **... Opponents**

Opponent No.2: Sri Pala Gopala Krishna S/o. Chandra Sekhara Rao, Hindu, Male, Aged 43 Years. Junior Assistant ,ZILLA parishad, "P" Section, Eluru, Eluru Dist.

పైన ఉదహరించి డిస్పూటెంట్ చిట్ ఫండ్ కంపెనీవారు వారి చీటి బాకీ రాబట్టుకొనే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా గ్రంధములో పై అధారిటీ వారు మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంధము **ది.27-05-2025వ సం॥రం తేదిన** వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు అనగా **ది.27-05-2025వ సం॥రం తేదిన ఉదయం 11-00 గంటలకు** డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ జిల్లా రిజిస్ట్రారు గారి కార్యాలయం ఏలూరు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైన ఉన్నయెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు:
For Usha Bala Chits (P) Ltd.
ఏలూరు **P. Kalyana Chakravarthy**
తేది:28-04-2025 Fore Man,

(డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రారు ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా

A.A.C.F.No. 37/2024

Between:

M/s Usha Bala Chits(P) Ltd. N.R.Pet, Eluru.
Represented by its Forman/Manager
Sri P. Kalyana Chakravarthy **...Disputant**

And

Sri. Tadikonda Srinivasa Murthy & others **... Opponents**

Opponent No.4: Sri Sagurthi Srinivasa Rao, S/o. Seshaiah, Hindu, Male, Aged 48 Years. Lab Assistant, Koneru Butchaiah Chowdary, Z.P. High School (Boys), Patamata, Vijayawada, N.T.R. Dist.

Opponent No.5: Kasavajjala Nagamani Sivavarma Deekshitulu, S/o. K. Ch. Subbaiah, Hindu, Male, Aged 49 Years. Senior Assistant, O/O Joint Director of Agriculture, Guntur, Guntur, Dist.

పైన ఉదహరించి డిస్పూటెంట్ చిట్ ఫండ్ కంపెనీవారు వారి చీటి బాకీ రాబట్టుకొనే నిమిత్తము దాఖలు చేసిన పై నెంబరు దావా గ్రంధములో పై అధారిటీ వారు మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయునది ఏమనగా పై నెంబరు దావా గ్రంధము **ది.27-05-2025వ సం॥రం తేదిన** వాయిదా ఉన్నందున మీరు ఆ రోజు అనగా **ది.27-05-2025వ సం॥రం తేదిన ఉదయం 11-00 గంటలకు** డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ జిల్లా రిజిస్ట్రారు గారి కార్యాలయం ఏలూరు వారి ఎదుట మీరు గాని, లేదా మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ వాదనలు ఏమైన ఉన్నయెడల దాఖలు చేసుకొనగలరు. అట్లు మీరు హాజరు కాని యెడల పై నెంబరు దావా గ్రంధము మీ పరోక్షమున తీర్మానింపబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు:
For Usha Bala Chits (P) Ltd.
ఏలూరు **P. Kalyana Chakravarthy**
తేది:28-04-2025 Fore Man,

(డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ఆర్బిట్రేటర్ ఏలూరు, ఏలూరు జిల్లా వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన యివ్వడమైనది)

మిగులు భూములు పేదలకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల పంచాయితీలోని మిగులు భూములు పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం పంచాయతీలో కొంతకాలంగా రెవెన్యూ, అటవీ శాఖాధికారుల మధ్య భూ వివాదం జరుగుతున్న నేపథ్యంలో గ్యాప్ ఏరియా భూములను సర్వే చేయాలని పేర్కొన్నారు. మిగులు భూములు అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని, మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు.

ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

ప్రత్యేక డిఎస్‌సికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, షెడ్యూల్ ఏరియా ఆదివాసీ ప్రాంతంలో వంద రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని కోరుతూ ఈ నెల రెండో తేదీన రాష్ట్ర మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. ఏజెన్సీ ఏరియాలో ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగ నియామక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల రెండో తేదీన జరిగే మన్యం బంద్‌కు మండలంలోని వాణిజ్య, వ్యాపార సంస్థలు, హోటల్స్, ప్రభుత్వ కార్యాలయాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం వెంకట్రావు, ధర్మల నాగేంద్ర, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో బుధవారం పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షను అబ్జర్వర్ సంజీవరావు, కో-ఆర్డినేటర్ వివి.కృష్ణమోహన్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 770 మంది విద్యార్థులకు 699 మంది హాజరుతో 90.09 శాతం హాజరు నమోదైందని తెలిపారు. మొట్టమొదటిసారి నూజివీడులో పాలిసెట్ ఎంతో గొప్పగా నిర్వహించారని ప్రశంసించారు. పాలీసెట్ నిర్వహణలో ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారని అధికారుల బృందం అభినందించింది.

జీలుగు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల పరిధిలో మూడు రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. బుధవారం కొత్తరామయ్యపేట పునరావాస కాలనీలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గూటాలలోని రెండు రైతు సేవా కేంద్రాల్లో 50 క్వింటాళ్లు, పట్టిసీమలో పది క్వింటాళ్లు, పోలవరం మూడు రైతు సేవా కేంద్రాల్లో 40 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గునపర్తి చిన్ని, కరిబండి నాగరాజు, పాదం ప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహ నిరోధంపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పాతరావిచెర్ల గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ (క్రాఫ్) వారి ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ నేతృత్వంలో అక్షయ తృతీయ మాసం ప్రారంభ సమయంలో, బాల్య వివాహ నిరోధంపై ప్రతిజ్ఞను మత పెద్దలతో కనకదుర్గమ్మ ఆలయంలో చేయించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ప్రతిజ్ఞలో క్రాఫ్ సిఎస్‌డబ్ల్యూ కె కృష్ణవేణి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలి

రైతు సంఘం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను గుర్తించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతు సంఘం మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని స్వర్ణవారిగూడెం, పాములవారిగూడెం, ములగలంపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు, అరటి, పామాయిల్ పంటలను రైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు బిక్కిన వీరసత్యం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పోలవరం : రోడ్డుపై చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు

పోలవరం : మండలంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు, వర్షానికి పలుచోట్ల రహదారులపై చెట్లు నేలకూలాయి. దీంతో రహదారులు దిగ్బంధమై ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో బుధవారం రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి తమ సిబ్బందితో పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో ప్రగడపల్లి సమీపంలో కూలిన భారీ వృక్షాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. దీంతో రోడ్డు మార్గంపై నిలిచిన వాహనాలకు మార్గం సుగమమైంది.

పడిపోయిన ఆయిల్ పామ్ చెట్లు

జంగారెడ్డిగూడెం : మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు జంగారెడ్డిగూడెం తాడువాయిలో రైతు సింహాద్రి శ్రీనివాసరావుకు చెందిన 3.58 ఎకరాల ఆయిల్ పామ్ తోటలో 48 పామాయిల్ చెట్లు నేలకొరిగాయి. నేలకూడిన చెట్లను రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈదురు గాలుల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కొనసాగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు రావాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ ఇన్సెంటివ్‌లతోపాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజు బుధవారం కొనసాగింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్ష శిబిరాన్ని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జెఎసి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ ప్రభుత్వంవ గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చి జీతాలు పెంచాలని కోరారు. ఈ



నిరవధక సమ్మెలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షుడు నోరి శ్రీనివాస్, ఏలూరు తాలుకా కార్యదర్శి కప్పల సత్యనారాయణ, ఎన్‌జిఒ సంఘ నాయకులు గంగాధర్, మోహన్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు సొంగా సిద్ధయ్య, జిల్లా కార్యదర్శి సురేంద్ర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులకు అందించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

పే స్లిప్‌లు ఇవ్వాలని ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - చాట్రాయి

తమకు పే స్లిప్పులు ఇవ్వాలని కోరుతూ చాట్రాయిలో ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజు బుధవారం పనిచేస్తున్న ప్రదేశం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ గ్రామీణ కూలి సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్పులు ఇవ్వట్లేదని, వేసవికాలంలో కూలీలకు, మేట్లకు కూలితోపాటు అదనపు వేతనం కూడా ఇవ్వడంలేదని చెప్పారు. కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు.

వెంకన్న కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి హామీ పనిచేస్తూ పని ప్రదేశంలో చనిపోయిన పెంకి వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వడ దెబ్బ తగిలి చనిపోయిన ఉపాధి కూలీ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. మంగళవారం కుక్కునూరు గ్రామంలో పెంకి వెంకన్న వడదెబ్బ తగిలి చనిపోయారని తెలిపారు. ఈ కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, రోజువారి కూలీ పనులు చేస్తేనే జీవితాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. నేటికీ భూమి, సరైన ఇల్లు లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. రోజువారి పని చేసుకుంటూ కుటుంబాలను వెల్లదీస్తున్న వెంకన్న చనిపోవడం ఆ కుటుంబానికి తీవ్ర లోటని పేర్కొన్నారు. చనిపోయిన వెంకన్న కుటుంబానికి నష్టపరహారం ఇవ్వాలని, చదువుకున్న పిల్లలకు ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. వెంకన్న కుటుంబానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి, ఆమె మృతికి సంతాపం తెలియజేస్తున్నామని తెలిపారు.

బైక్ చోరీ కేసులో ముగ్గురికి జైలు

నరసాపురం : నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు ఆరు నెలల కఠిన కారాగార జైలు శిక్షను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి విధించినట్లు కోర్టు లైజనింగ్ అధికారి ఎఎస్ఐ కె.భాస్కర్‌రావు తెలిపారు. వివరాల ప్రకారం.. ఇంటి ముందు పార్క్ చేసిన తన యమహా ఆర్15 బైక్ అపహరణకు గురైందని 2024 ఆగస్టు 23వ తేదీన వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన కరిపల్లి దొరబాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ టివి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా భీమవరానికి చెందిన యలమంచిలి సతీష్ బాబు, కర్రీ రాము, నారా ధనుష్ ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరికి గురైన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా సుదీర్ఘ విచారణ అనంతరం బుధవారం ముగ్గురు నిందితులకు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తుది తీర్పు వెల్లడించారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడి ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలైన ఘటన 16వ నెంబర్ జాతీయ రహదారిపై తణుకు పాత టోల్‌గేట్ సమీపంలో చోటు చేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుగొండ మండలం వడలి గ్రామం నుంచి తాడేపల్లిగూడెం ఇటుక రవాణా చేస్తున్నారు. వడలి గ్రామానికి చెందిన నలుగురు కూలీలు ఎన్.ఏసు (40), కంకిపాటి నందీశ్వరరావు, తొంట దుర్గాప్రసాద్, నాగబాబు ట్రాక్టర్ రవాణా చేస్తున్న ఇటుకపై కూర్చున్నారు. పెరవలి నుంచి తణుకు వైపు వస్తున్న క్రమంలో పాత టోల్‌గేట్ సమీపానికి వచ్చేసరికి స్కూటీపై ఎదురుగా వచ్చిన వ్యక్తి యూ టర్న్ తీసుకున్నాడు. స్కూటీని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ట్రక్కు రోడ్డు పక్కన మార్జిన్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యేసు ఇటుకుల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన కూలీలు ట్రాక్టర్ పైనుంచి దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నందీశ్వరరావు తలకు, వెన్నెముకకు గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. యేసు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య భవాని, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. ప్రశాంత్ వడలి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద విలపించిన తీరు పలువురుని కంటతడి పెట్టించింది.

బొలెరో వాహనం ఢీకొని...

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు మండల పరిధిలోని బత్తులవారిగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పెదపాడు మండలం పాత ముప్పర్రు గ్రామానికి చెందిన ఏసుబాబు మైలవరంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతున్న తన బాబాయ్ కుమార్తెను ఇంటికి తీసుకొచ్చేందుకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో బత్తులవారిగూడెం వద్ద బొలెరో వాహనం ఢీకొని ఏసుబాబు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యుదాఘాతంతో విద్యార్థి గాయాలపాలైన ఘటన నగరంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. దెందులూరు సంత మార్కెట్ ప్రాంతానికి చెందిన సందీప్ ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. ఈ క్రమంలో బుధవారం తన స్నేహితులతో కలిసి ఇండోర్ స్టేడియంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఆట అనంతరం స్నేహితులు సరదాగా అతని చెప్పును స్టేడియం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కంచె లోపల భాగంలో విసిరివేశారు. సందీప్ అతని చెప్పును కంచె నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెకు మధ్య ఎర్త్ కావడంతో సందీప్ విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. తోటి స్నేహితులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం అతను ఇంటికి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు గాని కేసు గాని నమోదు కాలేదు.

ఘటనపై డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు స్పందించారు. ఇండోర్ స్టేడియంలో ఉదయం ఆరు గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8:30 వరకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఇందుకు భిన్నంగా కొంతమంది విద్యార్థులు ఇండోర్ స్టేడియంలోకి అక్రమంగా వెళ్లి క్రికెట్ ఆడుతున్నారన్నారు. ఇందుకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత వహించాల్సింది వారి తల్లిదండ్రులేనిని గుర్తించాలన్నారు. ఈ విషయాలపై ఇప్పటికే మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రదేశాల్లో దాడులు నిర్వహించి ఒక కేసు నమోదు చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది కలిసి బుధవారం గణపవరం మండలం సిహెచ్.అగ్రహారం గ్రామంలో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం పరుచుకున్నట్లు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు వెబ్ సైట్‌లో హాల్ టికెట్లు

ఏలూరు:మహాత్మా జ్యోతిబా పూలే రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 4వ తేదీ ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకూ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లు వెబ్‌సైట్ https://mjpapbcwreis.apcfss.in అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని 4వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

మేడే నేడే





1886 చికాగో అమరవీరులు 8 గంటల పని దినం కోసం సాగించిన పోరాటాలు, వారి త్యాగాల ఫలితంగా మేడేను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నాం. 139 సంవత్సరాల క్రితమే 8 గంటల పని దినాన్ని సాధించుకున్న స్ఫూర్తితో బ్రిటీష్ కాలంలోనే దేశంలో కార్మికులు పోరాడి అనేక కార్మిక చట్టాలు సాధించుకున్నారు. అయితే భారతదేశంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికవర్గంపై దాడి పెరిగింది. ఇప్పుడున్న కార్మిక హక్కులకు రక్షణ లేకుండా కార్మికవర్గాన్ని అణచడానికి, యాజమాన్యాలకు మరిన్ని లాభాలు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకొచ్చింది. ప్రపంచంలోనే అత్యధిక గంటలు పని చేస్తున్న దేశంగా భారతదేశ కార్మికవర్గం రికార్డులకెక్కింది. 8 గంటల పని దినం స్థానంలో కార్మికులతో 10 నుంచి 12 గంటలకుపైగా పని చేయించుకునేలా మళ్లీ ప్రయత్నిస్తున్నారు. ఏ స్ఫూర్తితో మేడేను సాధించుకున్నామో, ఆ స్ఫూర్తికి విఘాతం కలిగేలా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఎల్అండ్‌టి సంస్థ ఛైర్మన్ సుబ్రమణ్యం దేశంలో కార్మికులు 90 గంటలు పని చేయాలని, సెలవు రోజుల్లో కూడా భార్య ముఖం చూస్తూ ఏం చేస్తారని చేసిన వ్యాఖ్యలు మనందరికీ తెలిసిందే. ఇన్ఫోసిస్ ఛైర్మన్ నారాయణమూర్తిసైతం ఉత్పత్తి పెంచేందుకు కార్మికులు వారానికి 70 గంటలుపైనే పని చేయాలని సెలవిచ్చారు. ఇటువంటి పెట్టుబడిదారులకు మరిన్ని లాభాలు సాధించి పెట్టేందుకు మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ ద్వారా 8 గంటల పని దినానికి మంగళం పాడుతోంది. ఈ నేపథ్యంలో మేడే స్ఫూర్తితో మోడీ ప్రభుత్వ విధానాలపై మరింత పట్టుదలగా కార్మికవర్గం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఏలూరులో అతి పెద్ద పరిశ్రమ కొన్ని వేల మందికి ఉపాధి చూపించిన ఏలూరు, కొత్తూరు జ్యూట్‌మిల్లులు మూతపడ్డాయి. ఐదు వేల మంది పని చేస్తున్న పరిశ్రమలు మూతపడినా ప్రభుత్వం దాన్ని తెరిపించేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయినా వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు కనీస చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలు, డెల్టా పేపర్ మిల్లు, అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఇంత పెద్దఎత్తున పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డునపడ్డా ప్రభుత్వాలకు కనీస చలనం ఉండటం లేదు. కార్మికులకు చట్టప్రకారం రావాల్సినవి ఇప్పించడంలో, పరిశ్రమలు తిరిగి తెరిపించడంలో కార్మిక శాఖ చొరవ చేయకుండా చూసీచూడనట్లు వ్యవహరించడంతో కార్మికుల ఉపాధితోపాటు రావాల్సిన నష్టపరిహారాలు కూడా కోల్పోతున్నారు. యాజమాన్యాలు లాభాలు వచ్చినంత కాలం అనుభవిస్తూ, ఆస్తులు కూడబెట్టుకుంటూ నష్టం వస్తే కార్మికులపై నెపం మోపుతున్నారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న పరిశ్రమల్లో కూడా అత్యధిక శాతం వలస కార్మికులతోనే పనులు చేయిస్తున్నారు. బీహార్, ఒడిశ్శా, ఛత్తీసఘడ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల కార్మికులే జిల్లాలో అత్యధిక శాతం పని చేస్తున్నారు. వీరెవరికీ కనీస వేతనాలు ఇస్తున్న దిక్కే లేదు. 12 గంటల నుంచి 14 గంటలపాటు వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఎవరైనా ప్రమాదవశాత్తూ చనిపోయినా చడీచప్పుడు లేకుండా అర్ధరాత్రి మృతదేహాలను ఎటువంటి నష్టపరిహారమూ ఇవ్వకుండా తరలిస్తున్నారు. సంపద సృష్టిస్తానని అనేక మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైతం మూతపడ్డ పరిశ్రమల గురించి ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. పైగా ఇప్పటి వరకూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో ఊదరగొట్టిన చంద్రబాబు ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మికుల హక్కులు హరించే చర్యలకు పాల్పడుతున్నారు. దానిలో భాగంగా యజమానులకు లాభదాయకంగా, కార్మికులకు ప్రాణ సంకటంగా పరిస్థితులు మారుతున్నాయి. యజమానులకు అనుకూలంగా ఫ్యాక్టరీల తనిఖీ అధికారం లేకుండా చేయడం, భద్రత ప్రమాణాలు గాలికొదిలేయడం, పని గంటలు యజమానుల ఇష్టానికి వదిలేయడం, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ అధికారాలు కుదించి వారి చేతులు కట్టేయడం వంటి చర్యల వల్ల ఆంధ్ర రాష్ట్రంలో ఏదోకమూల ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం అక్కిరెడ్డిగూడెం పోరస్ కెమికల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 12 మంది కార్మికులు మరణించారు. జిల్లాలో ఈ రెండు సంవత్సరాల కాలంలో 10 పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి సుమారు 20 మంది కార్మికులు మరణించారు. మూడు నెలల కాలంలోనే పెదవేగి మండలంలోని ప్రసాద్ సీడ్స్, లింగపాలెం మండలంలో జిఎస్ సీడ్స్ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి ఇద్దరు కార్మికులు మరణించారు. మరణించాక హడావిడిగా నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం తప్ప ప్రమాదాల నివారణకు చిత్తశుద్ధితో ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. ప్రమాదాలు జరిగిన చోట కార్మిక సంఘాలు బలంగా ఉంటే పోరాడి నష్టపరిహారాలు సాధిస్తున్నాయి. లేకపోతే యాజమాన్యాలు తూతూమంత్రంగా పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. సంపద సృష్టికి మూలం కార్మికులు. వారి శ్రమ మాత్రమే. అయితే నేటి పాలకవర్గాలు సంపద సృష్టికర్తలు కార్పొరేట్ కంపెనీలేనని విశ్వసిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు మారుస్తున్నారు. కార్మికుల జీవితాలు నాశనం చేస్తున్నారు.

ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం తెచ్చిపెడుతున్న ఆక్వా పరిశ్రమ కార్మికులు కనీస వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. చేపలు, రొయ్యల చెరువుల్లో పని చేసే కార్మికులు, ఐస్‌ప్లాంట్లలో పని చేసే కార్మికులు, ప్రాసెసింగ్ ప్లాంట్, ఫీడ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు కనీస వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి కార్మిక చట్టాలూ అమలు చేయడం లేదు. ప్రమాదవశాత్తు మరణించినా యాజమాన్యాలు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నాయి. దేశంలో పామాయిల్ ఉత్పత్తి చేయడంలో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది. పామాయిల్ పరిశ్రమల యాజమాన్యాలు వందల కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్నా, పని చేస్తున్న కార్మికులకు మాత్రం తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారు.

మారని చంద్రబాబు తీరు.. ★★★

ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు తమ కూటమి సిద్ధంగా ఉందని, అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని ఎన్నో వాగ్దానాలు చేశారు. కానీ సంవత్సరం గడుస్తున్నా ఆయన తీరు చూస్తే 'ఓడ దాటే దాకా ఓడ మల్లయ్య.. ఓడ దాటిన తర్వాత బోడి మల్లయ్య' అనే చందంగా ఉంది. వేతనాలు పెంచాలని 42 రోజులపాటు అంగన్వాడీలు వీరోచితంగా పోరాటం సాగించిన క్రమంలో నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు అనేక వాగ్దానాలు చేశారు. అయితే ఆయన అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఒక్క వాగ్దానమూ అమలు చేయలేదు. చంద్రబాబు తీరుపై అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులు ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి సంస్థల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న వారిపై ప్రభుత్వాలు ఇష్టానుసారం రోడ్డు ట్యాక్స్, ఇన్సురెన్స్ పెంచడం వల్ల భారం తీవ్రంగా పెరుగుతోంది. ఇష్టానుసారం పెనాల్టీలు పెంచి డ్రైవర్లను దోచుకుంటున్నారు. జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వెల్ఫేర్ బోర్డు ఊసెత్తడం లేదు. బోర్డు ద్వారా రావాల్సిన పరిహారాలను చెల్లించకుండా కార్మికులకు ద్రోహం చేస్తుంది. అయితే భవన నిర్మాణ సంస్థల యజమానుల నుండి వందల కోట్ల రూపాయలు సెస్ మాత్రం వసూలు చేస్తున్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా వేల కోట్ల రూపాయలు ఆర్జించిన ప్రభుత్వం, ఆ నిధులను దారి మళ్లించి భవన నిర్మాణ కార్మికులను నట్టేటముంచింది. ముఠా, హమాలీ వంటి అసంఘటిత కార్మికులకు కనీస భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, ఆటోమొబైల్స్ తదితర సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి చట్టాలూ అమలు కాక కట్టు బానిసల్లా పని చేస్తున్నారు. యాజమాన్యాలు కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తుంటే వారి వద్ద పని చేసే సిబ్బందికి మాత్రం కనీస వేతనాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏలూరు నగరానికి ఆనుకొని ఉన్న సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో పని చేస్తున్న సిబ్బందికి చాలా అన్యాయంగా అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారు. 10, 15 ఏళ్ల సర్వీస్ దాటినా కేవలం రూ.పది వేలలోపు మాత్రమే వేతనం ఇస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇన్ని ఘోరాలు జరుగుతున్నా కార్మిక శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. రిలయన్స్, సిఎంఆర్, డీమార్ట్ వంటి పెద్దపెద్ద సంస్థల్లో 200 నుంచి 300 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. సమస్యలపై అడిగితే వారిని ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగిస్తున్నారు. యాజమాన్యాల వేధింపుల వల్ల అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరోవైపు జొమాటో, స్విగ్గీ, అమెజాన్ తదితర ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు పెరుగుతున్నాయి. వాటిలో పని చేస్తున్న గిగ్ వర్కర్స్ బాధలు వర్ణనాతీతం. యజమాని ఎవరో తెలియకుండా, వారి మొహం చూడకుండా వారికి శ్రమ మొత్తం ధారపోస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మరుసటి రోజు వారికి పని ఉండదు. వెంటనే వారిని యాప్ నుండి డిలీట్ చేస్తారు. ఈ రకంగా కొత్త తరహాలో కార్మిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో గత ప్రభుత్వ హయాంలో కేవలం మూడు వేల మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేసి చేతులు దులుపుకున్నారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మంది కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. వారు నిరాశతో జీవిస్తున్నారు. వేతనాలు కూడా అరకొరగానే పెంచి తీరని అన్యాయం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు కూడా వీరికి అమలు చేయడం లేదు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, ఐకెపి విఒఎలు, మున్సిపల్ తదితర రంగాల కార్మికుల సమస్యలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. చంద్రబాబు నాయుడు సైతం అదే బాటలో పయనిస్తున్నారు. పథకాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా దోపిడీ చేస్తున్నారు. గౌరవ వేతనం, ప్రోత్సాహకాలు పేరుతో మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశగా ఎదురుచూసిన కార్మికులు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

పోరాటాలే శరణ్యం.. ★★★

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడి తీవ్రతరం చేశాయి. దేశ స్వాతంత్ర కాలం నుండే పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. 8 గంటల పని దినాన్ని రద్దు చేసి తిరిగి బానిసత్వంలోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో యావత్ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడం ఒకటే సరైన మార్గం. ఐక్యత–పోరాటం నినాదంతో రానున్న కాలంలో కార్మికవర్గ పోరాటాలు నిర్వహించడం మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

– డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, ఏలూరు

వేతనాలు పెంచాలని విఆర్ఎల వినతి

భీమవరం:గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతనాలు పెంచాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు విఆర్ఎలతో భర్తీ చేయాలని విఆర్ఎల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం రీ సర్వేలు, శిస్తు వసూలు, రకరకాల విధులు చేస్తూ విఆర్ఎలకు తీరిక లేకుండా పని చెబుతోందన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ తాతలు, తండ్రుల పోస్టుల్లో వారసులకు పని చేయడానికి అవకాశం కల్పిస్తున్నారు కానీ వారిని విఆర్ఎలుగా గుర్తించడం లేదని, గుర్తింపు లేకుండానే రిటైర్మెంట్ వయసుకు వస్తున్నారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో అచ్చయ్య, గ్రామ రెవెన్యూ సహాయకులు ఉన్నారు.

మేడే ఉత్సవాలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి – భీమవరం

శ్రమజీవుల హక్కుల సాధన రోజు మేడే ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో కార్మిక సంఘాలన్నీ సమాయత్తమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మేడే ఉత్సవాలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. కార్మిక దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలపై గర్జించేందుకు కార్మికులంతా ఒక్కటై చేయిచేయి కలిపి ముందుకు సాగనున్నారు. అన్ని పట్టణ, మండల కేంద్రాల్లోనూ జెండావిష్కరణలు, ప్రదర్శనలు, సభలు పెద్దఎత్తున సాగనున్నాయి. జిల్లా కేంద్రం భీమవరంతోపాటు తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు తదితర కేంద్రాల్లో భారీ ర్యాలీలు, సభల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. పారిశ్రామికవాడలు, పరిశ్రమల ప్రాంతాలతోపాటు పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో ఎర్రని తోరణాలు కట్టి అలంకరించారు. సభలు నిర్వహించే ప్రాంతాల్లో కార్మికుల నినాదాలు, డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయమే కార్మికులంతా తమ పని ప్రదేశాల్లో కార్మిక జెండావిష్కరణలు చేయనున్నారు. అనంతరం నిర్ణీత ప్రాంతానికి చేరుకుని ఆయా పట్టణాల్లో ప్రధాన వీధుల గుండా ప్రదర్శనలు, సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలతోపాటు ఇతర ప్రముఖులు సైతం పాల్గొనున్నారు. మేడే సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ కార్మికులు నినదించనున్నారు. కార్మిక చట్టాలు అమలు కాకపోవడంతో ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా అంగన్వాడీ, ఆశ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, ఉపాధి హామీ కూలీలు, 108, 104 ఉద్యోగులు తదితర ప్రభుత్వ ఉద్యోగులు తమ హక్కుల కోసం రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో ఎనిమిది గంటల పని ఎక్కడా అమలు కావడం లేదు. యాజమాన్యాలు 14 గంటలపాటు కార్మికుల చేత పని చేయించుకుంటున్నా సంబంధిత శాఖ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ కాలంలో పరిశ్రమల్లో ప్రమాదాలు పెరిగాయి. మోడీ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు వల్ల రోజుకు రూ.178 కనీస వేతనం వస్తుంటే కార్మికులు ఏవిధంగా బతుకుతారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో కార్మికులంతా ఒకే తాటిపై నడిచేందుకు మేడే వేదిక కానుంది. దీంతో ఈ ఏడాది మేడే ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనిలో భాగంగా ప్రధాన ట్రేడ్ యూనియన్‌గా ఉన్న సిఐటియు మేడే ఉత్సవాలను అత్యంత ఘనంగా ఘనంగా నిర్వహించేందుకు పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది.



తోరణాల అలంకరణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

ఊరూవాడా రెపరెపలాడనున్న ఎర్ర జెండాలు
250 ప్రాంతాల్లో కార్మిక జెండాల ఆవిష్కరణ
భీమవరంలో రెండు వేల మంది కార్మికులతో మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ
హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు

భీమవరంలో 2 వేల మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ

జిల్లా కేంద్రమైన భీమవరంలో మేడే వేడుకలకు సర్వం సిద్ధమైంది. ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్, కొత్త బస్టాండ్ వంటి ప్రధాన సెంటర్లతోపాటు ప్రధాన కూడళ్లలో జెండాలు, తోరణాలతో అలంకరించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద రెండు వేల మంది కార్మికులతో మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిఐటియు కార్యాలయం నుంచి మావుళ్ళమ్మ గుడి సెంటర్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, బొంబాయి స్వీట్ సెంటర్, వెంకటేశ్వరస్వామి రోడ్డు మీదుగా నటరాజ్ థియేటర్ రోడ్డు, గాంధీచౌక్ మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ నుంచి మావుళ్ళమ్మ గుడి రోడ్డు గుండా సిఐటియు కార్యాలయం వరకు ప్రదర్శన సాగనుంది. అక్కడ నిర్వహించే బహిరంగ సభకు రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. జిల్లావ్యాప్తంగా 20 మండలాలు, ఆరు మున్సిపల్ పట్టణాలతోపాటు మిగిలిన గ్రామాల్లో 250 చోట్ల జెండాలు ఆవిష్కరించి సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రకాష్‌నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి – భీమవరం టౌన్

భీమవరం 29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్‌టి కాలనీలో డ్రెయినేజీ, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రకాష్‌నగర్‌లో డ్రెయినేజీ, తాగునీటి కుళాయిలు, వీధిలైట్లు ఇతర సమస్యలతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించినా ఇంతవరకూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వేసవిలో మంచినీటి గురించి అనేకసార్లు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వార్డు సభ్యులు, నాయకులు

ట్యాంకర్లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. మైదానపు గిరిజనులు 42లో సుమారుగా 120 కుటుంబాలు నివాసం ఉంటున్నారని వాళ్లకి వ్యక్తిగత మరుగుదొడ్లు లేక పంట కాలువలు, చేల గట్టున మలవిసర్జన చేయుట వల్ల రైతులతోనూ, ప్రజలతోనూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఆధార్ కార్డులు లేక ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు అందటం లేదని ఆయన అన్నారు. సమాజంలో వాళ్లని మనుషులుగా చూడటం లేదని, ఎన్నికల ముందు వాళ్ల ఓట్లు మాత్రం కావాలని, ఎన్నికలు అయిన తర్వాత వారి సమస్యలు పాలకులు పట్టించుకోవటం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వారి సమస్యల్ని పరిష్కరించాలని, లేకుంటే పట్టణంలో ఉన్నటువంటి మైదానం గిరిజనులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన పోరాటం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.త్రిమూర్తులు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, దుర్గారావు, సంజీవరావు, మరియమ్మ, యేసు, యోహాను, అక్కులయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పరిశోధన స్థానం సమావేశాలు

పెనుమంట్ర : మే 1, 2వ తేదీల్లో మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం రెండు రోజులు జరుగుతుందని ఫారం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్ ఇక్కడ తెలిపారు. ఈ సమావేశంలో ఏలూరు, కోనసీమ, కాకినాడ, ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయ సంచాలకులు, రైస్‌మిల్లర్‌లు, వరి ఎగుమతిదారులు, పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో గోదావరి మండలంలో చేపట్టవలసిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల గురించి చర్చిస్తారు.

చవాకులకు ఇంటర్ నేషనల్ సోషల్ అవార్డు

పాలకొల్లు : విశాఖపట్నంలో ఉన్న పబ్లిక్ లైబ్రరీ హాల్‌లో ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ సోషల్ అవార్డ్స్ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకొల్లులో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి చవాకుల నరేష్‌బాబుకు ఇంటర్నేషనల్ బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ అవార్డ్, ఆంధ్రప్రదేశ్ ఐకాన్ అవార్డు ప్రధానం చేశారు. చవాకులకు అవార్డు రావడం పట్ల పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

'ఆక్వా సాగు విరామానికి సహకరించండి'

పెనుమంట్ర : ఆక్వారంగంలో ప్రస్తుత పరిస్థితుల కారణంగా పంట విరామం పాటించాలని రైతులు తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరించాలని జిల్లా ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు కోరారు. పెనుమంట్రలో స్థానిక జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం ప్రతినిధి, స్థానిక ఉప సర్పంచి భూపతిరాజు శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంట విరామం వల్ల ఆక్వారైతులు నష్టపోతున్నా ముందు వచ్చే మంచి కాలం కోసం ఎదురు చూద్దామని అన్నారు. నరసాపురం, పాలకొల్లు, ఆచంట పరిసర ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం : మున్సిపల్ సిబ్బంది పట్టుకుని ఉంచిన ఆవు చనిపోవడం, చనిపోయిన ఆవును చెత్త ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డ్‌లో పూడ్చి పెట్టడంపై మున్సిపల్ సిబ్బంది వైఖరిపై పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభం నుంచి వాడీవేడిగా సాగింది. పట్టణంలోని ఆవులను పట్టుకుని జరిమానా విధించిన అధికారులు పందులు పట్టినప్పుడు ఎలా వదిలేశారని కౌన్సిలర్ పతివాడ పద్మ ప్రశ్నించారు. కౌన్సిలర్ చెప్పడంతో అప్పట్లో పట్టిన పందులను వదిలేసానని కమిషనర్ అంజయ్య చెప్పారు. ఆ కౌన్సిలర్ పేరు చెప్పాలని పట్టుపట్టారు. ఆవు మృతిపై బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లు శాంతించారు. మార్కెట్లో తిరిగే ఆవులను పట్టినప్పుడు ఐదు రోజులు కంటే ఎక్కువ రోజులు ఉంచవద్దని, పందులపై చర్యలు తీసుకోవాలని కో ఆప్షన్ సభ్యుడు వైకెఎస్ సూచించారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మాట్లాడుతూ అడ్మినిస్ట్రేట్ లోపం వల్ల మీటింగ్ సమయం అంత వృధా అవుతుందని, కమిషనర్ ప్రతి సమాధానం దాటవేస్తున్నారన్నారు. పనులలో అలసత్వం వహిస్తున్న కమిషనర్ అంజయ్యపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియం ముందు నినాదాలు చేసారు. కౌన్సిల్ తీర్మానం చేసి 70 పనులను నిలిపివేశారు. ఆ అభివృద్ధి పనులు కూడా చేపట్టాలన్నారు. వైకెఎస్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరగడం లేదని, అధికారులు పని మాకు వద్దని తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. పూడికతీత పనులను అధికారుల పర్యవేక్షణలో నాణ్యత జరగాలని కౌన్సిలర్ కోటిపల్లి సురేష్ అన్నారు.

సమాజ చైతన్య జ్వాల శ్రీశ్రీ

పాలకొల్లు : స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభు త్వ(స్వయం ప్రతిపత్తి) కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం సమాజ హృదయాంతరాళాలను కదిలించే చైతన్య జ్వాలని పేర్కొన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతి ఎన్‌విడి.దినకరన్, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.ఉషారాణి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

నరసాపురం : పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి లబ్ధిదారులు మల్లవరం లంక గ్రామం గంగపట్నం శ్రావణి రూ.25,760 చెక్కును ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి, ప్రభుత్వం ద్వారా అందుతున్న సహాయాన్ని త్వరితంగా అందజేయడమే తన కర్తవ్యమని తెలిపారు. కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గంట కృష్ణ, మైల వసంతరావు పాల్గొన్నారు.

వెంకటకృష్ణారావుకు పరామర్శ

నరసాపురం : ఆదికేశవ ఎంబరమన్నారు స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, సీనియర్ న్యాయవాది పుప్పాల వెంకటకృష్ణారావును హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జస్టిస్ భవాని ప్రసాద్ పరామర్శించారు. ఇటీవల కృష్ణారావు తల్లి చంద్రావతి అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో భవాని ప్రసాద్ పట్టణంలోని కోవెల వీధిలో నివాసం ఉంటున్న కృష్ణారావు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. జస్టిస్ స్వయానా చంద్రవతికి మేనల్లుడు అవుతారు.

ఫారెస్ట్ అధికారుల కర్కశత్వం..!

(మొదటి పేజీ నుంచి)

తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి పనులు చేయొద్దు.. మిషన్ కోతలు వద్దంటూ హుకుం

దాదాపు తొమ్మిది మండలాల్లో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. కొల్లేరు లోపల బెడ్ గ్రామాలు 76 ఉండగా, కొల్లేరును ఆనుకుని ఉన్న బెల్ట్ గ్రామాలు 46 వరకూ ఉన్నాయి. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు మండలాల్లోని పలు గ్రామాలతోపాటు, ఆకివీడు వంటి మండలాల్లోనూ బెల్ట్ గ్రామాలు ఉన్నాయి. కొల్లేరులో ఎకరా, రెండెకరాలు సాగు చేసుకునే రైతులంతా చిన్న, సన్నకారు రైతులే. ఆ కుటుంబాలకు ఈ పొలాలే జీవనాధారం. రబీ సాగు చేసుకుంటున్న కొల్లేరు రైతుల వద్దకు వెళ్లి మిషన్లతో కోత కోయకూడదని ఫారెస్ట్ అధికారులు అడ్డు పెడుతున్నారంటూ రైతులు వాపోతున్నారు. పంట కాలువల్లో ఉపాధి పనులు చేయొద్దని అడ్డంకులు సృష్టిస్తున్నారు. వచ్చే రబీలో వ్యవసాయ సాగు చేసుకోవాలంటే పంటకాలువలు బాగు చేయడం తప్పనిసరి. ఇదంతా మామూళ్ల కోసం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మంత్రులు, జిల్లా అధికారుల మాటలు హుళక్కే

డిఆర్‌సి సమావేశంతోపాటు అనేక జిల్లా సమావేశాల్లో కొల్లేరు రైతుల సమస్యలు ప్రస్తావనకు వస్తున్నాయి. ఎంఎల్‌ఎలు అక్కడి రైతులు పడే ఇబ్బందులను మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. రైతులకు ఇబ్బంది కల్గించేలా చర్యలు తీసుకోవద్దంటూ ఫారెస్ట్ అధికారులకు మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు చెప్పడం, తర్వాత ఫారెస్ట్ అధికారులు అవేమీ పట్టనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిపోయింది. ఫారెస్ట్ అధికారులు రైతుల పట్ల వ్యవహరిస్తున్న కర్కశత్వంపై సరైన ఆదేశాలు జారీ చేయకపోతే ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఏడెకరాల్లో పంటను ముంచేశారు

సానబోయిన సుబ్బాయమ్మ, రైతు, పెదనిండ్రకొలను



పొలం కోత దశకు చేరుకుంది. చుట్టుపక్కల మాసూళ్లు జరుగుతున్నాయి. రెండు రోజులు సమయం ఇస్తే కోత కోసి ధాన్యం తీసుకెళ్లిపోతామని ఫారెస్ట్ అధికారులను వేడుకోవడం జరిగింది. అలాగే అంటూ చెప్పి.. మేము ఇంటికి వచ్చిన తర్వాత చేపల చెరువుకు గండికొట్టేశారు. ఏడెకరాల పొలంలోని పంట మునిగిపోయింది. ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వమే న్యాయం చేయాలి.

ఉపాధి పనులు చేయవద్దంటున్నారు


మండా రామకృష్ణ, అడవికొలను గ్రామం, నిడమర్రు మండలం



కొల్లేరును ఆనుకుని రెండెకరాల పొలం ఉంది. ఇదే మాకు జీవనాధారం. ఫారెస్ట్ అధికారులు వచ్చి కోత మిషన్ తీసుకురాకూడదంటూ అడ్డుపెడుతున్నారు. ఉపాధి పనులు చేయకూడదని చెబుతున్నారు. తాము చేపల చెరువులు తవ్వడం లేదు. వరిసాగు చేసుకుంటామన్నా అడ్డుపడుతున్నారు. ప్రభుత్వం దీనిపై రైతులకు న్యాయం చేయాలి.

ప్రశాంతంగా పాలిసెట్

(మొదటి పేజీ నుంచి)



భీమవరం: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మందికి 3,015 మంది హాజరవ్వగా 527 మంది గైర్హాజరయ్యారు. నూ జివీడులోని రెండు కేంద్రాల్లో 770 మందికి 699 మంది హాజరవ్వగా 71 మంది గైర్హాజరయ్యారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 2,376 మంది బాలురు, 1,338 మంది బాలికలు హాజరవ్వగా 86.13 శాతం హాజరు నమోదైంది. ఏలూరులో సిఆర్‌రెడ్డి జూనియర్ కళాశాల, సిఆర్‌రెడ్డి పీజీ కళాశాల, సిఆర్‌రెడ్డి ఉమెన్స్ కళాశాల, సిఆర్‌రెడ్డి పాలిటెక్నిక్, సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా ఇవ్వడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు. సమయం మించి పోవడంతో సిఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాల్సిన ముగ్గురు విద్యార్థులను ఇంటర్ కళాశాలలోకి అనుమతించి పరీక్ష రాయించారు. కొయ్యలగూడెం నుంచి ఆర్‌టిసి బస్సులో వస్తున్న ఒక విద్యార్థిని కామవరపుకోటలో ఆ బస్సు ఆగిపోవడంతో ప్రత్యామ్నాయం వెతుకుని, సిఆర్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాల్సి ఉండగా ఇంటర్ కళాశాలకు రెండు నిమిషాలు ఆలస్యంగా చేరుకుంది. అక్కడ నుంచి వట్లూరులోని పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లాలంటే మరింత ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో అధికారులు ఇంటర్ కళాశాలలోనే పరీక్ష రాసేందుకు అనుమతించారు.

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, తణుకులో 8, నరసాపురంలో 4 పరీక్షా కేంద్రాలు మొత్తం జిల్లావ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 7254 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 6489 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 782 మంది గైర్హాజరయ్యారు. బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. భీమవరం విష్ణు సీతా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు తదితర వివరాలను చీఫ్ కోఆర్డినేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు, వేసవిని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పాలిసెట్ పరీక్ష నిర్వహణను పూర్తిచేసిన అధికారులు, పోలీసులు, సిబ్బందిని అభినందించారు. కలెక్టర్ వెంట చీఫ్ కోఆర్డినేటర్ సిహెచ్.నల్లపురాజు, సహాయ కోఆర్డినేటర్ రామకృష్ణ ఉన్నారు.

ఎఎస్‌ఆర్ నగర్ వాసులకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాలి

(మొదటి పేజీ నుంచి)

150 చదరపు గజాల్లోపున్న వారందరికీ ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసే ఇస్తామని, ఈ నెల 29వ తేదీన రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. 151 నుంచి 300 గజాలు ఉన్నవారికి రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని దానిలో తెలిపారన్నారు. 31 నుంచి 451 గజాల వరకూ ఉన్న వారికి దస్తావేజుల రిజిస్ట్రేషన్ పరంగా చెల్లించాల్సిన ఫీజులు ఇతర వివరాలను ఆ ఉత్తర్వుల్లో పొందిపర్చినట్లు చెప్పారు. ఆయా ఉత్తర్వుల ప్రకారం ఎఎస్‌ఆర్.నగర్‌లో 50 ఏళ్ల నుంచి నివసిస్తున్న 130 మంది పేద కుటుంబాల ప్రజలు నిజమైన అర్హులన్నారు. వీరందరూ కేవలం 72 గజాల్లోనే ఇళ్లు నిర్మించుకున్నారని అధికారులే నిర్ధారించారన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ చేసి పట్టాలివ్వాల్సిన స్థానంలో ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు అక్రమంగా ఇళ్లను కూల్చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలిస్తామని హామీ ఇస్తే ఎంఎల్‌ఎ వైఖరి మాత్రం దానికి విరుద్ధంగా ఉందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశీర్వయ్య, మండల నాయకులు దున్నా మరియమ్మ, పాలా వెంకటస్వామి, వాసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయమని కెవిపి ఫంక్షన్ హాల్ అధినేత గోలి నాని అన్నారు. బుధవారం వరదరాజపురంలో స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారులకు, వాహనదారులకు దాహార్తి తీర్చడానికి వీలుగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.పద్మారావు, కె.రమణ, శ్రీను, వాసు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

శాఖా గ్రంథాలయాల్లో పిల్లల కోసం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను ఎక్కువ మంది వినియోగించుకోవాలని లైబ్రరీ అధికారి పిటి.శివకుమార్ కోరారు. మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో వి లవ్ రీడింగ్ ప్రోగ్రాంతో పాటు తెలుగు నీతి కథల పఠనం జరిగింది. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో కె.జన్మిత, ప్రవీణ, బి.ఆశా, బి.సరియు, బి.నైనశ్రీ, వినయ్, ఎస్.రమేష్, వి.సాయి, టి.కృష్ణ, పి.ఈశ్వర్, ఎ.నాని, ఎస్.మెహన్ తదితర విద్యార్థులతో పాటు మానవతా సభ్యులు, లైబ్రరీ అసిస్టెంట్ రామారెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : స్థానిక ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం మూడవరోజు వేసవి శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రిసోర్స్‌పర్సన్ పత్తి వీరాస్వామి విద్యార్థులకు పంచతంత్రం కథలోని కోడి తొక్కిన నువ్వుల కథను, ఆర్.నాగేంద్రకుమార్ ఇంగ్లీష్ గ్రామర్, ఎ.జనార్ధన రావు సమాజం గురించి, బాపయ్య శర్మ మనిషికి, చెట్లకు మృగాలకు తేడా గురించి వివరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈరోజు శిక్షణా తరగతులకు 40 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. విద్యార్థులందరూ ఈ శిక్షణా తరగతులను వినియోగించుకోవాలన్నారు.

పలువురు పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ

భీమవరం టౌన్ : ఎన్నో ఏళ్లుగా పోలీస్ శాఖలో విశేష సేవలు అందించి ఉద్యోగ విరమణ చేపట్టినప్పటికీ మీరు ఎప్పుడూ మా కుటుంబ సభ్యులే అని జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు అన్నారు. సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో తీసేసి సేవలందించి ఉద్యోగ విరమణ చేపడుతున్న వారికి వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఎస్‌పి కార్యాలయంలో చేపట్టారు. కె.కొండలరావు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్-943, తాడేపల్లిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కె.భాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్-2196, భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్, సిహెచ్.విశ్వేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్-372 ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.మోజెష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉండి : ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తుల వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్ఆర్‌పి అగ్రహారం ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ఉండి డివిజన్ ఇన్‌ఛార్జి మహేష్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, రైతు భూపతి రాజు మాట్లాడుతూ రైతులందరూ సేంద్రీయ పద్ధతుల్లో పంటలు పండించాలన్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు లేవు

అనుచిత వ్యాఖ్యలు అసలే లేవు

ఇళ్ల స్థలాల కోసం పోరాడింది మేమే

విలేకరులు సమావేశంలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఇళ్ల కూల్చివేత సమయంలో పాలకోడేరులో పర్యటించిన తమ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎవరిపైనా ఎటువంటి దోషణలు చేయలేదని సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు వివరించారు. తాము గాని, తమ నాయకులు గానీ ఎవరిపై ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. టిడిపికి చెందిన స్థానిక మండల నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడిన తీరు అభ్యంతరకరం అన్నారు. వారి మాటలను ఖండిస్తూ సిపిఎం నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టిడిపి ఆరోపణలకు సమాధానం ఇస్తూ పాలకోడేరులో తమ నాయకుడు ఎవరిని ఏవిధంగానూ దూషించలేదు అంటూ ఆనాటి పర్యటన వీడియోను ప్రదర్శించారు. ఎక్కడైనా తప్పుంటే విలేకరులు చెప్పండి అంటూ మాట్లాడారు. అదే వీడియోలు డిప్యూటీ స్పీకర్ మాటలను కూడా ప్రదర్శించారు. ఇప్పుడు చెప్పండి విలేకరులు ఎవరిది తప్పు అంటూ సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఇకపోతే ఇళ్ల స్థలాలపై పోరాటం తమదేనని దశాబ్దాల చరిత్ర తమకుందని, తమ చరిత్ర తెలియని వారు మాట్లాడితే సమంజసం కాదన్నారు. పేదల పార్టీ సిపిఎం అని, ఇళ్ల స్థలాల కోసం పోరాడే పార్టీ తమదేనని ఇప్పటికే ముద్ర పడిందన్నారు. ఇళ్ల స్థలాల కాలనీకి వెళ్లి అడగండి పోరాటం చేసిన వారు, ఆరోపణలు చేసిన టిడిపి వారా? మేమా చెబుతారు అంటూ ప్రతి సమాధానం చెప్పారు. పాలకోడేరులో ఇల్లు తొలగించే సమయంలో కనీస సమయం ఇవ్వకుండా పీకి వేశారన్నారు. పుస్తెలమ్ముకుని ఇల్లు కట్టుకున్న వారు లబోదిబోమంటూ రోడ్డు మీద ఏడుస్తున్నారన్నారు. ఇదేనా ఎంఎల్‌ఎ పాలనా తీరు అంటూ ప్రశ్నించారు. మంత్రి నారా లోకేష్‌ను ఉదాహరణగా తీసుకోవాలని చూపించారు. ఎక్కడ ఇల్లు ఉంటే అక్కడ పట్టాలిస్తున్నారన్నారు. ఒక ఉండి నియోజకవర్గంలో తప్ప మరెక్కడా ఇంత దారుణాలు లేవని వారు వివరించారు. తాము అభివృద్ధికి ఎన్నడూ ఆటంకం కాదని, ఉనికి కోసం పోరాటం అనేవారు ఒక్కసారి ఆకివీడు సిపిఎం చరిత్ర తెలుసుకోవాలన్నారు. అనంతరం పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సంధక ఉదయ కుమారి మాట్లాడారు. సమావేశంలో బివి.వర్మ, డోకల రవితేజ, బి.రాంబాబు, బి.పార్వతి పాల్గొన్నారు.

'మేడే'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో మేడేని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి పి.గోవిందు అన్నారు. మండలకేంద్రమైన గణపవరంలో గురువారం ఉదయం ఎనిమిది గంటలకు కార్మికవర్గంతో ర్యాలీ నిర్వహించి పోలీస్ ఐలాండ్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మివర్గం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో సిఐటియు పతాకాలు ఆవిష్కరిస్తామని తెలిపారు.



పెనుమంట్ర : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు

పెనుగొండ : మేడే కార్మికుల దినోత్సవం విజయవంతం చేయాలని మండలంలోని వివిధశాఖల వారీగా పెనుగొండ సిపిఎం కార్యాలయానికి తరలిరావాలని మండల కార్యదర్శి షేక్ బాదుషా నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు పంచాయతీ చెరువు దగ్గర నుంచి మెయిన్ రోడ్డు మీదగా సిపిఎం వాసంశెట్టి వీరన్న స్తూపం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

పెనుమంట్ర : కార్మికులకు చేటు చేసే లేబర్ కోడ్ రద్దు అయ్యేవరకు ఉద్యమం చేద్దాం అని, అదేవిధంగా మే డే సందర్భంగా గురువారం ప్రతీ కార్మిక, కర్షకుడు ఎర్ర జెండా ఎగురవేయాలని పెనుమంట్ర మండల శాఖ సిఐటియు కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ సెక్టార్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కె.సుబ్బరాజు, అంగన్వాడీ కార్మికులు సాయి మహాలక్ష్మి, మంగతాయారు, కొరణశీల శాంతి, భవాని పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొట్టు అవినీతి వల్లే సింహాచలం దుర్ఘటన

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేవదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అవినీతి వల్లే సింహాచలం దుర్ఘటన జరిగిందని ఎంఎల్‌ఎ, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం జనసేన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన కొట్టు సత్యనారాయణ అవినీతికి పాల్పడటం వల్ల సింహాచలంలో గోడ నిర్మాణం నాసిరకంగా జరిగిందని అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారని ఎంఎల్‌ఎ అన్నారు. వైసిపి నాయకులు సనాతన ధర్మం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వివరించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో హిందూ ధర్మానికి ఎంతో అపచారం జరిగిందన్నారు. తిరుపతి ప్రసాదాన్ని కలుషితం చేసిన ఘనత వైసిపికి దక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ దుర్ఘటన జరిగిన అది ప్రభుత్వానికి ఆపాదించే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. కొట్టు సత్యనారాయణ ఇప్పటికైనా శవ రాజకీయాలు మానుకొని నిజాయితీ గా వ్యవహరించాలని ఆయన కోరారు.

సింహాచలం దుర్ఘటన అత్యంత బాధాకరం

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: సింహాచలం నరసింహస్వామి వారి దర్శనం కార్యక్రమంలో ఏడుగురు దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని, దీనికి పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వ వైఫల్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం మాజీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ ఆలయాల్లో చేస్తున్న ఘోరాలు, బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న తీరు అత్యంత దారుణమన్నారు. ఆలయంలో ఇటీవల చేపట్టిన నిర్మాణాల్లో నాణ్యత పూర్తిగా లోపించిందన్నారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్‌ని రద్దుచేసి కూటమి నాయకులకు సంబంధించిన వారికి కాంట్రాక్టులు కట్టబెడుతున్నారన్నారు. పచ్చ మీడియా వీరికి రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. రోజుకో వేషం వేసే సనాతన ధర్మాన్ని కాపాడే ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఏం చేస్తున్నారో, ఎక్కడ ఉన్నారో అన్నారు. అధికారులు, పోలీస్ యంత్రాంగం ఎవరూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో లేరని చెబుతున్నారన్నారు. ఇంత నిర్లక్ష్యం ఈ పచ్చ మీడియాకు కనపడదా అని ప్రశ్నించారు. ఇటీవల తిరుపతిలో కూడా టికెట్లు ముందు ఇస్తామని భక్తుల తోపులాటకు కారణమయ్యారన్నారు. తిరుపతిలో ఏడుగురు చనిపోతే సనాతన ధర్మవాది అని చెప్పుకునే పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పి చేతులు దులుపుకొన్నారన్నారు. పవన్ కళ్యాణ్ ప్రతిదాన్ని ఒక పంచ్ డైలాగ్ లాగా చెప్పడం తప్ప చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కె.ధర్మరాజు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రి భాస్కర్‌రావు, వైసిపి నాయకులు బుద్ధాన్ని శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సింగం సుబ్బారావు పాల్గొన్నారు.

యశస్విని మృతి బాధాకరం : ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్ : మండలంలోని తుందుర్రు గ్రామానికి చెందిన యశస్విని రోడ్డు ప్రమాదం బాధాకరమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మంగళవారం ఇటీవలే హైదరాబాద్ నుంచి భీమవరం వస్తూ రోడ్డు ప్రమాదంలో యశస్విని మృతిచెందింది. తుందుర్రులో యశస్విని కుటుంబ సభ్యులను ఎంఎల్‌ఎ అంజిబాబు పరామర్శించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాలాభివృద్ధే లక్ష్యం : సర్పంచి

కాళ్ల : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా డిప్యూటీ స్పీకర్, ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు పనిచేస్తున్నారని సర్పంచి డొక్కు సోమేశ్వరావు అన్నారు. బుధవారం పెదఅమిరం సచివాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదఅమిరం గ్రామంలో ఆక్రమణలు తొలగించి వారికి పక్కా గృహాలు నిర్మించే విధంగా రెండు సెంట్లు కేటాయించామన్నారు. ప్రతి గ్రామంలో మైక్రో ఫిల్టర్ ద్వారా తాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు చేపడుతున్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజుపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. బొండాడ నీటి సంఘం అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి, కాళ్ల నీటిసంఘం అధ్యక్షులు మొగళ్ల మాధవరావులు మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, వైస్ ఛైర్మన్ సాయి లచ్చిరాజు, టిడిపి నాయకులు కొత్తపల్లి రాధాకృష్ణంరాజు, దాసరి రాజు, కాలువ వెంకట్రావు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన

ఆచంట : కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల్లో చైతన్యం తీసుకురావడానికి కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. సమాజంలో కిశోరి బాలికలు పలు రకాలుగా అన్యాయానికి గురవుతున్నారని, తెలిసితెలియని వయసులో ప్రేమ పేరుతో మోసపోతున్నారని, ఆపై సమాజంలో తలెత్తుకు తిరగలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మరికొందరు బాలికలు బాల్య వివాహాలకు బలైపోతున్నారని అన్నారు. ఫోక్సో చట్టం, వ్యక్తిగత శుభ్రత, సైబర్ నేరాలు, మొబైల్ వాడకం వంటి వాటిపై గ్రామస్థాయిలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అధికారులు శ్రీను, జేమ్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం ఉండాలి

భీమవరం టౌన్ : శారీరక, మానసిక దఢత్వం పెంపొందించుకుంటే అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అన్నారు. కళాశాల పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్నర్ ఇంజనీరింగ్(పిఎఐఇ) పేరిట నిర్వహించిన ఉత్కర్షయోగ, మేధా యోగ, ప్రజ్ఞాయోగ వంటి అంశాలపై భీమవరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5 నుంచి 17 సంవత్సరాల వయసు మధ్య ఉన్న విద్యార్థులకు వేసవి శిక్షణ అందించారు. శిక్షణలో ప్రధానంగా విద్యార్థుల మనసును ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా నిలుపుకొని లక్ష్యాలు సాధించగలమని ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నట్లు పిఎఐఇ కోఆర్డినేటర్, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని అన్నారు. పి.రమేష్ రాజు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థిని సత్కరిస్తున్న ప్రతినిధులు

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు గ్రామంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి టెన్త్ ఫలితాల్లో మండల ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన చెల్లబోయిన ప్రణీత(589), కె.సింధు భవిత(582)లను స్థానిక కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మంగళవారం రాత్రి ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి బద్దిరెడ్డి శ్రీనివాస్, ట్రస్ట్ ఫౌండర్, నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి, ట్రస్ట్ ట్రెజరర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, వివేకానంద స్కూల్ డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి ప్రసంగించారు.

నా చావును కోరుకుంటున్నారు

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు

తాడేపల్లిగూడెం:'నాతో ఉన్న కొంతమంది నాయకులు నేను చనిపోవాలని కోరుకుంటున్నారని' ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కడకట్లలోని 32వ వార్డులో అసంపూర్ణంగా నిలిచిన స్విమ్మింగ్ పూల్ పనులను బుధవారం ఆయన తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 'నేను అడగకుండానే సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటీ 80 లక్షలు అందించారన్నారు. నేను కూటమి ఎంఎల్ఎను, నేను చనిపోయి ఉప ఎన్నికలు వస్తే కొంతమంది ఎంఎల్ఎ అయిపోవాలని చూస్తున్నారని' తెలిపారు. ఎవరు త్యాగాల వల్ల తనకు ఎంఎల్ఎ సీటు రాలేదని, మూడు పార్టీలు కలిపి మ్యాండేడ్ ఇచ్చారని, తాడేపల్లిగూడెం ప్రజలు అత్యంత మెజార్టీతో గెలిపించారని తెలిపారు. తాను చనిపోతే ఉప ఎన్నికల కోసం గుంటనక్కల్లా ఎదురుచూస్తున్న వారి ఆలోచనలను తాను జీర్ణించుకోలేక పోతున్నానని బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఎవరు నడుచుకున్నా సహించేది లేదని, వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది తాడేపల్లిగూడెంను మరో పిఠాపురం చేస్తామంటున్నారని, తానేమీ చేతులకు రాజులు తోడుక్కోలేదన్నారు. ఏ పార్టీ కార్యకర్తనూ ఇబ్బంది పెట్టలేదని, సామాన్య ఆర్‌టిసి డ్రైవర్ కొడుకు నేడు తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ స్థాయి కల్పించిన ప్రజలే నాకు దేవుళ్ల అని, వారి ఆశీర్వాదాలే తనకు నూరేళ్ల ఆరోగ్యమని, ఎప్పుడు చనిపోతానో తెలియదని, తన మరణంతో ఎంఎల్ఎ కావాలని కోరుకోవద్దని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

తాడేపల్లిగూడెంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మే 4న నీట్ యుజి - 2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో నీట్ పరీక్షల ఏర్పాట్లపై నీట్ యుజి అధికారులు, సూపరింటెండెంట్లు, విద్యా శాఖ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని తాడేపల్లిగూడెంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిట్ కళాశాలలో ఒకటి, శశి ఇంజినీరింగ్ కళాశాలలో మరో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఇఒ ఇ.నారాయణ, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శివన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.



అవుట్‌లెట్ రొయ్యల అమ్మకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

అవుట్‌లెట్‌లో రొయ్యల అమ్మకం

రైతు రాంబాబు వినూత్న ఆలోచన

ప్రజాశక్తి - వీరవాసరం

తాము సాగు చేస్తున్న రొయ్యలను అవులెట్ ద్వారా రిటైల్ అమ్మకాలు సాగించాలని ఓ రైతు వినూత్న ఆలోచన చేశారు. ఇందులో భాగంగా వీరవాసరం సంత మార్కెట్ వద్ద రొయ్యల సాగు రైతు మళ్ల రాంబాబు ఏర్పాటు చేసిన అవుట్‌లెట్‌ను భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల నుంచి రొయ్యలను తక్కువ రేటుకే కొనుగోలు చేయడంతో గత కొన్ని రోజులుగా రొయ్యల సాగు రైతులు నష్టపోతున్నారు. దీనికితోడు ట్రంపు సుంకాల మోత కూడా రొయ్య రైతులపై పండింది. ప్రభుత్వం నుంచి వీరికి సరైన సహకారం అందకపోవడంతో రైతులు రొయ్యల సాగుపై పునరాలోచనలో పడ్డారు. తాము పండించిన రొయ్యలను స్థానికంగా మధ్య దాళారీలు లేకుండా రిటైల్ అమ్మకాలు సాగించాలన్న ఆలోచనతో రైతు రాంబాబు ముందుకొచ్చారు. అతి సామాన్యుడు సైతం కొనుగోలు చేసే విధంగా రొయ్యలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కేజీ నుంచి నూట యాభై గ్రాముల వరకూ రొయ్యలను ప్యాకెట్ చేసి అమ్మకానికి ఉంచారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రొయ్యలు పౌష్టికాహారమన్నారు. సంవత్సరంలో ఒక మనిషి కేజీ రొయ్యలు తినడం ద్వారా అందులో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్‌తో గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, భోగిరెడ్డి శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, యరకరాజు హరిబాబు, చినబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
మేడే ప్రత్యేక అనుబంధం
8 పేజీలు | ఏలూరు, పశ్చిమగోదావరి | గురువారం 1-5-2025



లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తణుకులో నిరసన ప్రదర్శన (ఫైల్‌ఫోటో)

లేబర్ కోడ్‌ల అమలు.. కార్మికవర్గం ప్రతిఘటన

మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ లను పార్లమెంట్‌లో నాలుగేళ్ల క్రితమే ఎటువంటి చర్చ జరపకుండా ఆమోదం పొందారు. కార్మికుల నిరసనకు తలొగ్గి వాటి అమలుకు ఇప్పటిదాకా నోటిఫై చేయలేదు. సార్వత్రిక సమ్మెతో కూడిన దేశ వ్యాప్త ఐక్య పోరాటాలు వీటి అమలును తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నాయి.



తన సొంత బలం తగ్గినా టిడిపి, జెడియు వంటి పార్టీల మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ఎన్.డి.ఏ కార్పొరేట్ల అనుకూల నయా ఉదారవాద ఎజెండాను పూర్తి చెయ్యదలుచుకుంది. లేబర్ కోడ్‌ల అమలుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించింది.

లేబర్ కోడ్‌ల్లో ప్రస్తుతం ఉన్నది ఉన్నట్లుగా అమలు చేయడాన్ని, దేశంలో ఉన్న కార్మిక వర్గం అడ్డుకుంటుందనే హెచ్చరికను మోడీ ప్రభుత్వానికి, కార్పొరేట్లకు కూడా చేయాల్సి ఉంది. కార్మికవర్గ ఐక్య వేదిక పిలుపుమేరకు లేబర్ కోడ్‌ల అమలు ప్రారంభించిన వెంటనే దేశవ్యాప్తంగా అన్ని ప్రదేశాలలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి. దీనికి కొనసాగింపుగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి రద్దు చేయించు కోగలిగిన సంయుక్త కిసాన్ మోర్చా, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికోద్యమం చేస్తున్న పోరాటాలకు తమ పూర్తి మద్దతుని తెలియజేసింది. ఏళ్ల తరబడి పోరాటాలతో సాధించుకున్న హక్కులను హరించి, ఈ రకంగా కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తన విధానాలు తీసుకువస్తే, సంపద సష్టికర్తలైన శ్రమజీవులు ఐక్యంగా వాటిని ఎదుర్కొంటామని తెలియచెప్పాలి. లేబర్ కోడ్‌ల అమలు ఆపటానికి మరో దశ పోరాటానికి సన్నద్ధం చేయాల్సి ఉంది.

లేబర్ కోడ్ లను ఎందుకు వ్యతిరేకించాలి?

ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి, కార్మిక సంస్కరణల పేరిట నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం ఆ చట్టాల్లో కార్మికుల రక్షణకై ఉన్న కొద్దిపాటి అంశాలను కూడా తొలగించడమే. ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు సుదీర్ఘ పోరాటాల వల్ల సాధించుకున్నవి. అనేక లోపాలు వాటిలో ఉన్నా పని ప్రదేశంలో హక్కులు, వేతనాలు, సామాజిక భద్రత, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమం వంటి అంశాల ద్వారా ఎంతో కొంత రక్షణ కల్పిస్తున్నాయి. వీటన్నింటినీ తొలగించి యాజమాన్యాలకు మేలు చేయడమే ఈ లేబర్ కోడ్‌ల ఉద్దేశం.

సార్వత్రికత పేరుతో తెస్తున్న ఈ లేబర్ కోడ్‌లు అసంఘటిత రంగాన్నే కాకుండా, సంఘటిత రంగంలో ఉన్న అత్యధిక కార్మికులను సైతం ఈ కార్మిక చట్టాలకు దూరం చేస్తుంది. కోడ్‌లలో నిర్వచనాలు అత్యధిక కార్మికులను దూరం చేసేందుకు ఉద్దేశపూర్వకంగా మలచబడ్డాయి. ఉదాహరణకు 'ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ అండ్ వర్కింగ్ కండిషన్స్' (ఒహెచ్ఎస్‌డబ్ల్యుసి) అనేకోడ్‌లో ఉద్యోగి, కార్మికుడు అనే పదాలను ఒకదాని స్థానంలో ఒకటి వాడారు. ఉద్యోగి అనే పదాన్ని ఎక్కువసార్లు వాడడం ద్వారా యాజమాన్యాలు వక్రీకరించి కార్మికుల ఎడల వివక్ష చూపి ఈ కోడ్‌లోని ..2లో

లేబర్ కోడ్‌ల అమలు.. కార్మికవర్గం ప్రతిఘటన

(మొదటి పేజీ నుంచి)

అంశాల అమలుకు కార్మికులనుదూరంగా ఉంచే ప్రమాదం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి పరిశ్రమల్లో అప్రెంటిస్, ట్రైనీల పేరిట పనిచేస్తున్న వారు ఈ నిర్వచనాల్లో లేరు. ఉద్యోగి, కార్మికుడు పదాల నిర్వచనాల నుండి కాంట్రాక్ట్ కార్మికులు మినహాయించబడ్డారు. 'పారిశ్రామిక సంబంధాలు' అనే కోడ్‌లో సూపర్వైజర్లు, మేనేజర్లు అనే పదాలు వాడడం ద్వారా ఉద్యోగ కార్మికుల్లో అత్యధిక భాగం ఈ కోడ్ అమలు నుండి మినహాయించబడతారు. ఆ సూపర్వైజరీ హోదాలో రూ.18 వేలు వేతనం దాటిన తర్వాత వారు ఉద్యోగి/కార్మికుడు అనే నిర్వచనంలోకి రారు. అలాగే ఎష్టాబ్లిష్మెంట్ అనే నిర్వచనం కింద పది మందిలోపు కార్మికులు పని చేసే సంస్థలు కోడ్ పరిధిలోకి రావు. ఫ్యాక్టరీ నిర్వచనం కింద విద్యుత్ వినియోగించే సంస్థల్లో 20మందిలోపు కార్మికులు ఉన్నవి, విద్యుత్ వినియోగించని సంస్థల్లో 40 మందిలోపు కార్మికులు ఉన్నవి మినహాయించబడ్డాయి. ఒ.హెచ్.ఎస్.డబ్ల్యు.సి. కోడ్ నుండి 5 హెక్టార్లలోపు ఉన్న ప్లాంటేషన్స్‌కు మినహాయింపు ఇచ్చారు.


ఏలూరులో..

కోడ్ అమలు చేయాల్సిన కార్మిక పరిమితులను ఎంతవరకు సడలించారంటే వాటి సాకు చూపించి యాజమాన్యాలు తప్పించుకోవచ్చు.

ఉదాహరణకు...

- 500 లోపు కార్మికులు పనిచేస్తున్న ఫ్యాక్టరీ లేదా భవన, ఇతర నిర్మాణాల పనుల్లో సేఫ్టీ ఆఫీసర్ అవసరం లేదు.
- 250 మంది లోపు కార్మికులుంటే సంక్షేమ అధికారి అక్కర్లేదు.
- వందమంది లోపు కార్మికులుంటే క్యాంటీన్ సదుపాయం కల్పించనవసరం లేదు.
- 50 మంది లోపు మహిళా కార్మికులు ఉంటే క్రచ్ సదుపాయం కల్పించనవసరం లేదు.
- 50 మంది లోపు కార్మికులుంటే లంచ్ రూము, రెస్ట్ రూము ఇవ్వనవసరం లేదు.
- 500 మంది లోపు కార్మికులుంటే అంబులెన్స్ సౌకర్యం కూడా అక్కరలేదు.

కుదించడం, హేతుబద్ధం చేయడం పేరిట వేతనాలు, బోనస్‌కు చెందిన చట్టాలను వేతనాల కోడ్‌గా మార్చారు. కొన్ని అంశాలను దానిలో పొందుపరచడం ద్వారా, ప్రస్తుతం ఉన్నవి తొలగించడం లేదా బలహీనపరచడం ద్వారా యాజమాన్యాలకు మేలు చేసేట్లు తెచ్చారు. కనీస వేతనం నిర్దేశించడంపై 1957లో 15వ కార్మిక సమాఖ్య మార్గ నిర్దేశికాలు, 1992లో సుప్రీంకోర్టు 'రాప్టకోస్ అండ్ బ్రెట్' కేసులో ఇచ్చిన తీర్పు, 44, 45, 46 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లలో, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ లేబర్ ఇచ్చిన రికమండేషన్ పదేపదే చెబుతున్న అంశాలు పొందుపరచలేదు. కార్మిక సంఘాలు అవిశ్రాంతంగా జరిపిన పోరాటంతో అయిష్టంగానే డ్రాఫ్ట్‌లో చేర్చారు. మూల వేతనం, కరువు భత్యం, ఇతర అలవెన్స్ మాత్రమే అంటూ వేతనం నిర్వచనాన్ని కుదించారు. దీనిలో సార్వజనీనత ఎక్కడుంది? సార్వజనీనత కోసం తెచ్చామనటం నయవంచన తప్ప ఇంకోటి కానే కాదు.

రంగాల వారీ సంబంధించిన చట్టాలను పరిశీలిస్తే నిర్మాణరంగం,బీడీ సిగరెట్లు, మైన్‌లు, పోర్ట్‌లు, వర్కింగ్ జర్నలిస్టులు, సేల్స్‌ప్రమోషన్ ఎంప్లాయీస్, రవాణా రంగ కార్మికులు వంటి వారికి సంబంధించిన పని పద్ధతులు, యాజమాన్య సంబంధాలు, ఆయా రంగాల్లో పనులు చేసే విధానం, ఉండే సమస్యలు, భద్రత అంశాలు వంటి ప్రత్యేకతలను బట్టి ఉన్న చట్టాలను రద్దు చేశారు. వీటన్నిటికీ చెందిన ఓ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ అన్ని రంగాలకు చెందిన పని పద్ధతులకు 'ఒకే మోడల్ ఫిట్' అవుతుంది అన్నట్టుగా రూపొందించారు. ఈ రకంగా కార్మికులు ప్రధానంగా వలస కార్మికులు, కాంట్రాక్టు వర్కర్లు యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు, ఈ ప్రభుత్వ చర్యల వల్ల నెట్టివేయబడ్డారు.

సామాజిక భద్రత కోడ్‌లో బీడీ, ముడి ఇనుము మైన్‌లు, మైకామైన్‌లు, లైమ్ స్టోన్ మైన్‌లు, డోలమైట్ మైన్‌ల వంటి పరిశ్రమల్లో పనిచేసే అత్యధిక కార్మికులకు ప్రస్తుతం చట్ట ప్రకారం అమలవుతున్న సాంఘిక భద్రతా హక్కులు, సదుపాయాలు సందిగ్ధంలో పడ్డాయి. దీనికి కారణం ఈ రంగాల్లో సెస్ వసూలు కున్న అవకాశాలను రద్దు చేశారు. సాంఘిక భద్రతా కోడ్ వీరెవరికీ సామాజిక భద్రతా ప్రయోజనం కల్పించడం లేదు. ప్రభుత్వం ఎటువంటి బడ్జెట్ కేటాయించక పోవటంతో అసంఘటిత కార్మికులు కనీస సామాజిక భద్రతకు నోచుకోని దుర్భర పరిస్థితుల్లోకి వెళ్తారు.

ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ. వంటి సాంఘిక భద్రతా పథకాలను క్రమబద్ధీకరణ చేస్తున్నామనే పేరిట, ఈ సామాజిక భద్రతా కోడ్‌లో యాజమాన్య వర్గాలకు ప్రయోజనం కలిగించేట్లు యాజమాన్యాలు చెల్లించే వాటా శాతం తగ్గించటం, ఇ.పి.ఎఫ్. స్కీం నుండి సంస్థలకు మినహాయింపు ఇవ్వడం, ప్రస్తుతం ఇ.పి.ఎఫ్. అమలు చేసే సంస్థలు కూడా ఆ బాధ్యత నుండి తప్పుకునే అవకాశం కల్పించడం, ఇటువంటి నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేసేట్లు అంశాలున్నాయి.

కార్మిక సంఘాలన్నీ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్న గ్రాట్యూటీపై ఎలాంటి సీలింగ్ లేకుండా, అర్హతను బట్టి లెక్క కట్టాలనే అంశాన్ని పెడచెవిన పెట్టారు. సామాజిక భద్రతా కోడ్ లోనూ అలాగే ఉంది.

పనిగంటలు..

ఒ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ ఎనిమిది గంటల పనిపై విముఖత చూపుతూ, అమలు చేయని వారికి శిక్షలో మినహాయింపు సైతం ఇచ్చింది. 8 గంటల పని విధానం మార్చుకునే అవకాశం యాజమాన్యాలకు, ఆయా ప్రభుత్వాలకు కల్పించింది. ఈ కోడ్‌లో కుదించబడ్డ 13 కార్మిక చట్టాలు పని పద్ధతులపై ప్రస్తావిస్తూ పనిగంటలను నిర్దేశించాయి. ఫ్యాక్టరీ చట్టంలోను, సంబంధిత చట్టాల్లోను రోజువారీ పని గంటలు, వారంలో పని గంటలు, పని సమయం, విశ్రాంతి సమయం, ఓవర్ టైం డ్యూటీ, పని గంటల సర్దుబాటు వంటి అంశాలను వివరించారు. కార్మికుల న్యాయపరమైన వివాదాలప్పుడు ఇవి చర్చకు వచ్చేవి. ఈ కోడ్ వీటన్నిటిని తొలగించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాల దయా దాక్షిణ్యాలకు కార్మికులను వదిలివేసింది. కర్ణాటక రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం పనిగంటలు 8 నుండి 12కు పెంచుతూ ప్రతిపాదిస్తే దాని తర్వాత అధికారానికి వచ్చిన కాంగ్రెస్ దీన్ని నోటిఫై చేసింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం 12 గంటల పని విధానంపై తెచ్చిన నోటిఫికేషన్‌ను కార్మిక సంఘాలు, భాగస్వామ్య పక్షాల నుండి వచ్చిన వత్తిడి మేరకు ఉపసంహరించుకుంది. వీటిని పరిశీలిస్తే కార్మికుల సంక్షేమం కన్నా కార్పొరేట్లను 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట ఆకట్టుకోవడమే ఆ ప్రభుత్వాల విధానంగా కనబడుతోంది. లేబర్ కోడ్‌లు ఆమోదించి నోటిఫై చేయడానికి ముందే ఈ చర్యలు ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా ఆయా దేశాలు అమలు చేసిన ఎనిమిది గంటల పని విధానాన్ని మరోసారి చర్చకు పెట్టి ఆయా ప్రభుత్వాలు సమీక్షించడానికి పూనుకుంటున్నాయి. కార్పొరేట్ దిగ్గజాలైన నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం లాంటి వారు వారానికి 70 గంటల పని, 90 గంటల పని అంటూ డిమాండ్ చేయడం కార్మికుల శ్రమశక్తిని మరింత దోచుకుని వారి లాభాలు పెంచుకోవడానికే.

పారిశ్రామిక సంబంధాల కోడ్ కింద కుదించబడ్డ పారిశ్రామిక వివాదాల చట్టం ప్రస్తుతం సంఘానికి ఉన్న ప్రాథమిక హక్కులైన సమ్మె చేసే హక్కు, వివాదాలు పరిష్కరించుకునే హక్కు లాంటి వాటిని పూర్తిగా తీసివేసింది. సులభతరం చేయటం పేరు మీద ఉపాధి సంబంధాలపై ప్రభావం చూపే తాత్కాలిక సులభమైన సంబంధాలు ఉండేట్లు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్, కాంట్రాక్ట్ వర్కర్స్‌ను తెస్తున్నారు. ఈ తాత్కాలిక సంబంధాల వలన కార్మికులు తమంతట తాముగా సమీకరించబడలేకపోతున్నారు. కార్మికులు సమీకరించబడే వారి హక్కులను అడగనంత కాలం అవి కాగితాలకే పరిమితం అవుతాయి. వీటిని యాజమాన్యాలు ఉల్లంఘించ వచ్చు, శిక్షల నుండి మినహాయింపు పొందవచ్చు, ఎలాంటి భయం లేకుండా కార్మికులను యధేచ్ఛగా దోపిడీ చేయనూవచ్చు.

ఐ.ఆర్. కోడ్ యాజమాన్యాలకు హైర్ & ఫైర్ విధానం అమలు చేసే హక్కు, పని ప్రదేశంలో కార్మిక సంఘం లేకుండా ఉండేట్లు అవకాశం కల్పిస్తోంది. 'యూనియన్‌లు ఉండవు' అనే పాలసీ ఉన్న అమెజాన్, సాంసంగ్ వంటి బడా కార్పొరేట్లను శాంతింప చేయడానికే ఈ చర్యలు. మోడీ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం నయా ఉదారవాదం ఈ కేంద్ర ఉద్దేశానికి కట్టుబడి ఉంది.

పర్యవేక్షణ..

ఏ చట్టమైనా ఎప్పుడు ఉపయుక్తకరం అవుతుందంటే దాని అమలుకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినప్పుడే. కార్మిక చట్టాల విషయంలో ఇది పూర్తి సత్యం. తరచుగా తనిఖీ చేయటం ఫిర్యాదు వచ్చినప్పుడు వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించటం వంటి యంత్రాంగాలు ఉండాలి. లేబర్ కోడ్‌లలో కార్మిక శాఖ తనిఖీ అనేదే లేదు. ఇన్స్పెక్టర్ పేరు ఇన్స్పెక్టర్, ఫెసిలిటేటర్‌గా మార్చారు. వీరు వెబ్ ఆధారిత తనిఖీ చేయాలి. అది కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నట్లు. అంటే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుకూలంగా చేయడం తప్ప చట్టాలు సక్రమంగా అమలు అవుతున్నాయో లేదో చూడటం కోసం కాదు. ఇది ఐ.ఎల్.ఓ. 81వ కార్మిక తనిఖీ సదస్సు తీర్మానాన్ని ఉల్లంఘించడమే. 'పని ప్రదేశాన్ని తరచుగా తనిఖీ చేసి కార్మిక చట్టాలు సక్రమంగా అమలు అవుతున్నాయో లేదో విధిగా చూడాలి' అనేది ఐ.ఎల్.ఓ. సభ్య దేశాలన్నీ తప్పక పాటించాలనేది కూడా ఉల్లంఘించటమే. రాబోయే రోజుల్లో ఫిర్యాదును బట్టి కార్మిక శాఖ తనిఖీలు ఉండవు. ఆకస్మిక తనిఖీలు ఉండవు. పని ప్రాంత తనిఖీలు ఉండవు. వాటి స్థానం పర్యటించడం మాత్రమే ఉంటుంది. అది కూడా జాతీయస్థాయిలో కంప్యూటర్ నిర్దేశిత పని ప్రాంతాల్లోనే. (ప్రభుత్వం ఏదైనా ఉత్తర్వు ద్వారా ఇస్తేనే తనిఖీ ఉంటుంది, అదీ వారి మార్గదర్శకాల ప్రకారం). తనిఖీ ఆన్లైన్లో చేయవచ్చు లేదా ఫోన్ ద్వారా చేయవచ్చు. యాజమాన్యాలకు ఈ విషయం చాలా ముందస్తుగానే తెలపాలి. ఓ.ఎస్.హెచ్.డబ్ల్యు.సి. కోడ్ ఈ తనిఖీలకు థర్డ్ పార్టీని స్టార్టప్ వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేసుకునే అధికారాన్ని ప్రభుత్వాలకు కల్పిస్తోంది. తనిఖీల వ్యవస్థని తూట్లు పొడిచిన తర్వాత మిగిలిన అంశాలన్నీ కార్మికులకు నిరుపయోగమే.

పార్లమెంటరీ వ్యవస్థ స్థానంలో కార్యనిర్వాహక వ్యవస్థ

పనిగంటలు, భద్రత, ఆరోగ్యం, కనీస వేతనం నిర్ణయించే అంశాలు, వివిధ ప్రయోజనాలు, వాటాలు వంటివి కోడ్‌లలో పూర్తిగా నిర్వచించక పోవడంతో రానున్న రోజుల్లో వీటిలో ఏ విషయమైనా సరే పార్లమెంట్‌తో సంబంధం లేకుండా, యూనియన్లను కార్మికులను సంప్రదించకుండా నిర్ణయించవచ్చు. ఫాసిస్ట్ ఆర్.ఎస్.ఎస్. ఆదేశాలతో నడుస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులపై లేబర్ కోడ్‌లను ఆయుధంగా చేసుకొని యుద్ధం చేస్తోంది. కార్మికులకు పని ప్రాంత, కార్మిక సంఘ హక్కులను నిరాకరించడం ద్వారా వారి పని పద్ధతులు మరింత దుర్భరం చేసి శ్రమ శక్తిని మరింత దోచుకోవడానికి పాలక వర్గాలు కంకణం కట్టుకున్నాయని తెలుస్తోంది. లాభాల దాహంతో కార్పొరేట్లు, వారికి అండగా ప్రభుత్వంలో ఉన్న మతోన్మాద కార్పొరేట్ కూటమి కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించాలి, ఓడించాలి. ఈ ధృడ సంకల్పంతో కార్మిక వర్గం ఐక్యత పెంపొందించడానికి, పోరాటాలను తీవ్రతరం చేయటానికి, మరో దశ ఉద్యమానికి సన్నద్ధం కావాలి.

– డాక్టర్ కె.హేమలత, సిఐటియు అఖిల భారత అధ్యక్షులు

కేరళ ప్రత్యామ్నాయం.. పారిశ్రామిక రంగం

మానవాభివద్ధి సూచికలలో నిరంతరం పురోగమించడం ద్వారా గుర్తింపు పొందిన కేరళ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీనికి కారణం ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకై నికరంగా రాష్ట్రంలో జరుగుతున్న కషి. కేరళ అభివద్ధి నమూనాలో అందరికీ విద్య, ఆరోగ్యం అందించడం ఉంది. ఇది అంతర్జాతీయంగా మన్ననలు పొందింది. ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పరిశ్రమల వంటి వాటిలో పురోగమించకుండా ఈ నమూనా కొనసాగించగలమా అని ఇ ఎం ఎస్ నంబూద్రిపాద్ ఒకసారి అభిప్రాయం వ్యక్తం చేశారు. గత రెండు ఎల్.డి.ఎఫ్. ప్రభుత్వాలు రెండు కీలక అంశాలపై దష్టి సారించాయి. సామాజిక సేవా రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా నాణ్యమైన విద్య, ఆరోగ్య సదుపాయాలు, సంక్షేమం అందించడం, మౌలిక సదుపాయాలు అభివద్ధి చేస్తూ వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి పెంచడం.

ప్రభుత్వ నూతన పారిశ్రామిక విధానం "ప్రకతి-ప్రజలు-పరిశ్రమలు" నినాదంతో కేరళ రాష్ట్ర పారిశ్రామికాభివద్ధి ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్ల దష్టితో రూపొందింది. పర్యావరణం పరిస్థితి, అందుబాటులో ఉన్న భూమి ధర, రాష్ట్ర పారిశ్రామికీకరణకు ఆటంకంగా ఉన్నాయి. తదనుగుణంగా ప్రభుత్వ దష్టి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పైన, మేధస్సు ఆధారిత పరిశ్రమలపైన కేంద్రీకరించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం "ఇయర్ ఆఫ్ ఎంటర్ ప్రైజెస్" క్యాంపెయిన్ ప్రారంభించి ఆ ఒక్క సంవత్సరంలో లక్ష కొత్త సంస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యం చేసుకుంది. ఈ ప్రయత్నం సమన్వయంతో జరిగింది. ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశాలకు ఆయా శాఖల మంత్రులను భాగస్వామ్యం చేయడం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యాన ఉన్నత స్థాయి కమిటీ వేసి ఈ క్యాంపెయిన్‌ను పర్యవేక్షించారు. పరిశ్రమల మంత్రిత్వశాఖ కూడా చిన్న తరహా పరిశ్రమల సంఘాలను, కార్మిక యూనియన్‌లను సంప్రదించడం ద్వారా ఇవి సక్రమంగా అమలుచేయడానికి కషి చేసింది.

ఈ క్యాంపెయిన్ విజయవంతం కావడానికి స్థానిక స్థాయిలో పారిశ్రామిక అభివద్ధి జరగడానికి పారిశ్రామిక విభాగం మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను రిక్రూట్‌చేసుకుంది. చిన్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి నాలుగు శాతం వడ్డీ రేటు తగ్గించి వడ్డీ మినహాయింపు పథకాన్ని ప్రవేశపెట్టింది. సూక్ష్మ, చిన్న పెట్టుబడిదారులకు ఉపయోగకరంగా ఉండేట్లు రుణ మేళాలను నిర్వహించింది. స్థానిక పరిశ్రమల్లో టెక్నాలజీ వినియోగం పెంచడానికి, మంత్రిత్వశాఖ రీసెర్చ్ సంస్థలతో సమావేశాలు నిర్వహించి టెక్నాలజీ బదలాయింపునకు ప్రయత్నం చేసింది. నిర్దిష్ట సర్వే, సంప్రదింపుల ద్వారా స్థానిక తయారీలో చేయగలిగిన ప్రధాన ఉత్పత్తులను మంత్రిత్వశాఖ గుర్తించింది.

ఎం.ఎస్.ఎం.ఇ. ల లైసెన్సింగ్ విధానంలో ప్రభుత్వం గణనీయమైన మార్పు చేసింది. మొదటి మూడున్నర సంవత్సరాల పాటు లైసెన్స్ లేకుండా నిర్వహించుకుని, దాని తర్వాత అవసరమైన అన్ని లైసెన్సులు పొందేట్లు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ విధానం ద్వారా సింగిల్ విండో పద్ధతిలో పూర్తి చేయడమనే ఒక్క నిబంధనే పెట్టారు. ఈ క్యాంపెయిన్ తన లక్ష్యాన్ని ఆరు నెలల్లో చేరుకోవడమే కాకుండా తర్వాత ఆర్థిక సంవత్సరాలలో కూడా కొనసాగింది. 2024 నవంబర్ నాటికి 3,21,581 ఎం.ఎస్.ఎం.ఇ. లు రూ. 20,625 కోట్ల పెట్టుబడితో 6,82,241 ఉద్యోగాలను కల్పించారు. వ్యక్తిగత పొదుపు, బంగారం, ఎన్నారైల నుండి వచ్చిన సొమ్ము పారిశ్రామిక పెట్టుబడిగా మారింది. స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది బలోపేతం చేసింది.

అందర్నీ భాగస్వామ్యం చేయడమనేది ఈక్యాంపెయిన్‌లో కీలక అంశం. నూతన వ్యాపారం ప్రారంభించిన వారిలో 1,02,942 మంది మహిళలు, 37 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. సామాజిక తరగతులుగా చూస్తే షెడ్యూల్డ్ కులాల నుండి 11,794, షెడ్యూల్డ్ తెగల నుండి 945, మైనార్టీల నుండి 23,645 మంది ఉన్నారు. వచ్చిన సంస్థల్లో 45,233 తయారీ రంగంలోవి కాగా, సేవా రంగంలో 1,33,576 వచ్చాయి. ఈ వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి.

ఎం.ఎస్.ఎం.ఈ. లకు అండగా ఉండడానికి చార్టెడ్ అకౌంటెంట్స్ సంస్థ ఐ.సి.ఏ.ఐ. జిల్లా స్థాయిల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి జీఎస్టీ రిటర్న్, ఆర్థిక పత్రాలు తయారు చేయడానికి ఉచితంగా సేవలందించింది. ప్రభుత్వం కూడా జిల్లా స్థాయిలలో ఎం.ఎస్.ఎం.ఈ. క్లినిక్‌లను ఏర్పాటుచేసి టెక్నికల్, మేనేజ్మెంట్, మార్కెటింగ్ రంగాల్లో వత్తిపరమైన నైపుణ్యం ఉచితంగా అందించింది. వీటికి అదనంగా ఎం.ఎస్.ఎం.ఇ. ల ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 50 శాతం రాయితీ ఇస్తూ నూతన ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకొచ్చింది. మార్కెట్లో అవకాశం కల్పించడానికి ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖతో పరిశ్రమల శాఖ ఒక ఒప్పందం కుదుర్చుకుని స్థానిక పరిశ్రమలకు కె షాపులలో(రేషన్ షాపులకు అనుసంధానంగా ఏర్పాటు చేసినవి) ఉచితంగా స్థలం కేటాయించారు. ఆరు నెలల్లో ఈ కె షాపులు 10 కోట్ల అమ్మకాలు చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, సాంప్రదాయక రంగాలు, ఎం.ఎస్.ఎం.ఇ.లు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనువుగా ఆన్‌లైన్ ప్లాట్ ఫారాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. కార్మికుల్ని భాగస్వామ్యం చేస్తూ మంచి స్థాయిలో నాణ్యతను, పర్యావరణ బాధ్యత, నియమాలకు కట్టుబడి చేస్తున్న ఉత్పత్తులను పెంచడానికి "కేరళ బ్రాండ్" తెచ్చారు. అధికారులు వ్యక్తిగతంగా కొత్త సంస్థలను పర్యవేక్షించి జియో టాగింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. తమ విభాగం ద్వారా ఇబ్బంది పడుతున్న పెట్టుబడిదారుల ఉనికికి, అభివద్ధికి సహకారం అందించారు. ఈ రకంగా ప్రభుత్వం కొత్త ఎం.ఎస్.ఎమ్.ఈ. ల పరిరక్షణకు కషి చేసింది.

"మిషన్ థౌజండ్" అనే పథకాన్ని ప్రభుత్వం తీసుకురావడం ద్వారా రూ.100 కోట్ల సగటు టర్నోవర్ ఉండే విధంగా అవసరమైన ఆర్థిక సహాయాన్ని తోడ్పాటును అందించి 1000 పరిశ్రమలను అభివద్ధి చేయడానికి కషి చేసింది. క్యాంపస్ పారిశ్రామిక పార్కుల పేరిట ప్రవేశపెట్టిన వినూత్న పథకం ద్వారా చిన్న పరిశ్రమలకు ఆయా క్యాంపస్‌లలో భూమిని కేటాయించి, గంటల వారీ వేతనంతో విద్యార్థులను వినియోగించుకోవడం ద్వారా విద్యకూ, ఇటు పరిశ్రమలకూ ప్రత్యక్ష సంబంధం కల్పించారు. ఈ రకమైన ప్రయత్నాలు అన్నీ కూడా కేరళ రాష్ట్రంలో ఎం.ఎస్.ఎం.ఈ. లు పారిశ్రామిక సంవత్సరంలో పుంజుకోవడానికి దారితీశాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇది ఉత్తమమైన ప్రయత్నమని కొనియాడింది.

ఇటీవలే ప్రభుత్వం గహాధారిత చిన్న వ్యాపారాలకు కూడా పారిశ్రామిక లైసెన్సులు మంజూరు చేసి విద్యాధికులైన గహ యజమానులు సంపాదన పెంచుకునేట్లు చూడాలని నిర్ణయించింది. స్వయం సహాయక గ్రూపుల కోసం ప్రారంభించిన "కుటుంబశ్రీ" పథకం ప్రస్తుతం అతి సూక్ష్మ, సూక్ష్మ పరిశ్రమల పైన కేంద్రీకరించింది. మొత్తంగా ఈ ప్రయత్నాలన్నీ కేరళ రాష్ట్రాన్ని ఎం.ఎస్.ఎం.ఈ. లకు కేంద్రంగానూ, రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక పురోగతికి స్థిరత్వానికి తోడ్పడే దిశగానూ సాగుతున్నాయి.

- పి.రాజీవ్

స్టార్టప్‌లకు గడ్డుకాలం

- రెండేళ్లలో 28వేలకు పైగా కంపెనీలు క్లోజ్
- కొత్తగా వచ్చేవి కూడా చాలా తక్కువే..!
- ఈ ఏడాదిలో స్థాపించిన అంకుర సంస్థలు 125 మాత్రమే
- 'ట్రాక్సన్' నివేదిక సమాచారం



న్యూఢిల్లీ : దేశంలోని మోడీ పాలనలో అంకుర సంస్థలు(స్టార్టప్‌లు) అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలనీ, ఉద్యోగ కల్పనలో తమ వంతు పాత్ర పోషించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని చూస్తున్న యువపారిశ్రామికవేత్తలకు అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఇది వారిని తీవ్ర నిరాశకు, కలవరానికి గురి చేస్తున్నది. దేశంలో వేల సంఖ్యలో స్టార్టప్‌లు మూతపడుతుండటమే ఈ పరిస్థితికి నిదర్శనం. భారత్‌లో గత రెండేండ్లలో 28 వేలకు పైగా స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. డేటా ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది.

రెండేండ్లలో 12 రెట్లు అధికం

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. గత రెండేండ్లలో 28,638 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. ఇందులో, 2023లో 15,921, 2024లో 12,717 కంపెనీలు ఉన్నాయి. స్టార్టప్‌లు మూతపడుతున్న తీరు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. గత రెండేండ్లలో మూతపడిన స్టార్టప్‌ల సంఖ్య అనేది.. 2019 నుంచి 2022 మధ్య క్లోజ్ అయిన కంపెనీల సంఖ్య కంటే 12 రెట్లు అధికంగా కావటం గమనార్హం. ఈ మూడేండ్లలో క్లోజ్ అయిన అంకుర సంస్థల సంఖ్య 2300.

తగ్గిపోతున్న స్టార్టప్‌లు

దేశంలో కొత్తగా ఏర్పాటు చేసే స్టార్టప్‌ల సంఖ్య కూడా తగ్గిపోవటం ఆందోళనను కలిగిస్తున్నది. 2019 నుంచి 2022 మధ్య నెలకొల్పబడిన అంకుర సంస్థల సంఖ్య 9600కు పైగా ఉండగా.. అది 2024లో 5264కు పడిపోయింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు స్థాపించబడిన స్టార్టప్‌లు 125 మాత్రమే కావటం గమనార్హం. ఈ మూసివేతలు అధికంగా అగ్రిటెక్, ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్ రంగాలలో జరిగాయని తెలుస్తున్నది. స్టార్టప్‌ల కొనుగోలు సంఖ్య కూడా తగ్గిపోయింది. 2021లో ఇది 248గా ఉండగా.. గతేడాది 131కి పడిపోయింది. ఇక ఈ ఏడాదిలో ఇప్పటికే 259 స్టార్టప్‌లు క్లోజ్ అయ్యాయి. రాబోయే నెలల్లో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ చేయూత లేకే ఈ పరిస్థితి

అంకుర సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. యువతను ఉద్యోగార్థుల్లా కాకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. వారి ఆర్థిక స్వావలంబనకు అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి.. వివిధ రంగాల్లో కొత్తగా కంపెనీలు ఏర్పాటు చేసేవారికి, యువతకు ప్రభుత్వం నుంచి మద్దతు చాలా తప్పనిసరి. స్టార్టప్‌లకు ఎదురేయ్యే కష్టాలను గుర్తించి, వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి. అయితే, కొన్నేండ్ల క్రితం స్టార్టప్‌లపై ప్రభుత్వాలు పెట్టిన శ్రద్ధ.. ప్రస్తుతం కనబడటం లేదు. ఈ కారణంగానే అంకుర సంస్థలు మూతపడుతు, కొత్తవి ఏర్పాటు కాక.. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని నిపుణులు చెప్తున్నారు.



మే 20 సార్వత్రిక సమ్మెతో.. ప్రతిఘటనోద్యమ మరో దశ

భారత కార్మిక వర్గం, సమకాలీన పెట్టుబడిదారీ సంస్థాగత సంక్షోభం తీవ్రం అవడం వల్ల, గతంలో ఎన్నడూ ఊహించని పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొంటోంది. దీనికి పాలక వర్గం ప్రతిస్పందన మరింత దూకుడుగా, నిరంకుశ ఆధిపత్య ధోరణితో, ప్రస్తుతం ఉన్న ప్రజాస్వామిక చట్రంలోనే కార్మిక వర్గానికి ఉన్న సామూహిక, ప్రజాస్వామిక హక్కులను ఊడబీకుతోంది. జాతీయ స్థాయిలో, పని ప్రదేశంలో కార్మిక వర్గాన్ని నిరాయుధులను చేయడం, నయా ఫాసిస్టు పోకడగాను, బీజేపీ ఎన్.డి.ఎ పాలనా ముద్ర గాను గమనించాలి..

ఈ క్రమంలో భాగంగానే కార్మిక వర్గంపై బానిసత్వాన్ని రుద్దే విధంగా 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది. కార్మికవర్గాన్ని ఈ రకంగా బానిసలుగా మార్చడం కార్పొరేట్ – మతతత్వ వ్యవస్థ ఏర్పాటుకు పునాది అవుతుంది. తద్వారా ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో, సమాజ పాలనలో పూర్తిస్థాయి ఆధిపత్య వ్యవస్థ నెలకొల్పడానికి సాధ్యమవుతుంది.

మొత్తం పాలనా వ్యవస్థను నిరంకుశంగా మార్చే దిశలో ఒక భాగమే లేబర్ కోడ్‌లు. ఇవి 2019, 2020లోనే చట్టంగా తెచ్చినా, 2025లో ఇప్పటి దాకా అవి అమలు కాకుండా వివిధ స్థాయిల్లోని కార్మిక వర్గం పని ప్రదేశాల్లో, ఆయా రంగాల్లో, జాతీయ స్థాయిలో చేసుకున్న జోక్యాలు, ప్రతిఘటనలు ఆపగలిగాయి.

కానీ మూడో సారి వచ్చిన మోదీ ప్రభుత్వం, తన బలం గణనీయంగా తగ్గినా, లేబర్ కోడ్‌లు ఎలాగైనా అమలు చేయాలని, ఏప్రిల్ 2025లో వాటిని నోటిఫై చెయ్యడం లక్ష్యంగా పెట్టుకుంది.



ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలు, వివిధ రంగాల స్వతంత్ర ఫెడరేషన్‌ల ఐక్య వేదిక, పాలక పక్షం కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే షరతులను నీచమైన పన్నాగంతో తేవడాన్ని ఐక్య ప్రతిఘటనోద్యమం స్థాయి పెంచడం ద్వారా గట్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించింది.

ఈ నేపథ్యంలో 2025 మార్చి 18న న్యూ ఢిల్లీలో జరిగిన కార్మికుల జాతీయ సదస్సు, కార్మికవర్గ ఐక్య ఉద్యమం మరింత విస్తృత సమర శీల ప్రతిఘటన 2025 మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా తెలపాలని నిర్ణయించింది. మనపై ఎక్కు పెట్టిన ఈ సవాళ్లను స్వీకరించి, కార్మిక వర్గం ధిక్కరణ, ప్రతిఘటన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను పెద్ద ఎత్తున విజయవంతం చెయ్యడం ద్వారా తెలియజేయాలి.

నయా ఉదారవాదానికి వస్తున్న నిరసనను అణిచి వేయడానికి, అధికారంలో ఉన్న కార్పొరేట్ మతతత్వ జోడీ ప్రజానీకం ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను హరించి వేసే ప్రయత్నాల్లో భాగమే లేబర్ కోడ్‌లు. మన ప్రకతి, ప్రజా సంపదలను కొల్లగొట్టి చేజిక్కించుకోవడానికి, కార్మికులను మరింత దుర్మార్గంగా దోపిడీచేసి లాభాలు పెంచుకోవడానికి మార్గాలు సులువు చేయటమే వీటి ఉద్దేశం.

ఉదాహరణకు ఇటీవల తెచ్చిన 'జన విశ్వాస్' చట్టంలోని నిబంధనల ప్రకారం మోడీ ప్రభుత్వం బాయిలర్ చట్టం, ఫారెస్ట్ చట్టం, టీ చట్టం, రబ్బర్ చట్టం, ఇతర మందుల రంగానికి సంబంధించిన చట్టాలు వంటి 41 చట్టాల్లోని 180 కార్పొరేట్‌ల నేరాలను నేర రహితం చేసింది. ఈ చట్టాలు అమలుచేయకపోతే జైలుశిక్ష వంటి నిబంధనలు ఉపసంహరించి కొద్ది పాటి ఫైన్‌లకు పరిమితం చేశారు. తాజా బడ్జెట్లో మరో 100 రకాల నేరాలను నేర రహితం చేశారు. ఇది చట్టాలను ఉల్లంఘించటానికి లైసెన్స్ ఇవ్వడమే. కార్మిక చట్టాల నుండి కూడా శిక్షార్హత లేకుండా చేశారు. శ్రమ సమాధాన్, శ్రమ సువిధ పోర్టల్స్ ఫిర్యాదు ఆధారిత తనిఖీని ఆచరణలో లేకుండా చేశాయి. దీనితో యజమానులు కార్మిక చట్టాలను నిర్భయంగా ఉల్లంఘిస్తున్నారు.

మరో వైపు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాపాడు కోవడానికి చేసే సామూహిక చర్యలను నేరాలుగా పరిగణిస్తున్నారు. భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్) 111 సెక్షన్ ప్రకారం కార్మికులు, వారి సంఘాలు సామూహికంగా చేసే ఫిర్యాదులను కూడా నేరంగా పరిగణించి జైలు శిక్ష, నాన్ బెయిలబుల్ కేసులు వంటి పోలీస్ చర్యలు చేపడతారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మిక సంఘాల నేతలు, యాజమాన్యం లేదా కార్మిక శాఖకైనా సరే కార్మిక సమస్యలు తీసుకు వెళితే వారిపై పోలీస్ చర్యలు తీసుకున్నారు. లేబర్ కోడ్‌లు ఇంకా అమలు కాకుండానే కొన్ని ప్రభుత్వ సంస్థలు/విభాగాల్లో రోజు వారీ కార్మిక కార్యకలాపాలైన గేట్ మీటింగ్‌లు, డిపార్ట్ మెంట్ మీటింగ్‌లు, కరపత్రాల పంపిణీ, మెమొరాండం సమర్పించడం వంటివి కూడా నిషేధించారు. ఇవన్నీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడానికే....

సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉపాధి సంబంధాలు ప్రమాదకర, దురుసుగా ప్రవర్తించే ఉపాధిగా రూపాంతరం చెందుతున్నాయి. ఇది కేవలం కార్మికుల జీతాల ఖర్చు తగ్గించు కోవడం కోసం కాదు, కార్మిక సంఘాలు లేకుండా చేయడానికి. ఈ పద్ధతిని లేబర్ కోడ్ లు సులభతరం చేస్తాయి. శాశ్వత ఉద్యోగం అనేది గతించిందిగా దాని స్థానంలో పెద్ద ఎత్తున ఔట్‌సోర్సింగ్, అప్రెంటిస్, ట్రైనీ, ఇంటర్న్ వంటివి వస్తున్నాయి. కార్మిక చట్టాల పరిధికి కార్మికులను దూరం చేసేట్లు వినూత్న పదజాలం వాడుతున్నారు.

ఆర్థిక వ్యవస్థను నడపటంలో, రాజకీయ పాలన నిర్వహించటంలో, సమాజాన్ని కలుషితం చేసే విచ్ఛిన్నకర ప్రయత్నాలు వంటి దిక్కుమాలిన నేరత్వాలు ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగే వ్యవస్థ మొత్తం పాలనలో విస్తరించాలనే నిశ్చయంతో పెట్టుబడిదారీవర్గం, కార్మికులు, వారి సామూహిక ఉనికిని పూర్తిగా నిరాయుధం చేసే లక్ష్యంతో లేబర్ కోడ్‌ల అమలు, పద్ధతులు సులభతరం చేస్తున్నదని తేటతెల్లం అవుతోంది.

మోదీ ప్రభుత్వం అతి కొద్ది మంది క్రోనీలకు, సామాన్య ప్రజానీకం నుండి ముక్కు పిండి వసూలు చేసిన పన్నుల ద్వారా నిండిన ఖజానాను, దోచుకుని దోపిడీ చేసుకొమ్మని తెరిచి ఉంచింది. ఉత్పత్తి ఆధారిత ఇన్సిడెంట్, క్యాపెక్స్ ఇన్సెంటివ్, ఉపాధి ఆధారిత ఇన్సెంటివ్ వంటి స్కీములు ఉత్పత్తి ఖర్చును, అస్థిర వ్యాపార ఖర్చులను, కార్మికులకు అయ్యే ఖర్చులను, కార్పొరేట్లు ప్రత్యేకించి గుత్త సంస్థలు ప్రజాధనం గుంజడానికి తెచ్చినవే. ఇవి ప్రభుత్వానికి ఆదాయం తెచ్చేవి కానీ ఉపాధిని కల్పించేవి కానీ కావు. మరో వైపు ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, విద్య, ఆరోగ్యానికి, పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాలకు బడ్జెట్ వాస్తవ కేటాయింపుల్లో కోతలు వేసింది.

పెట్టుబడిదారీ విధానంలో తీవ్రమవుతున్న వ్యవస్థాగత సంక్షోభం నేపథ్యంలో నయా ఉదారవాదం నయా ఫాసిస్టు ధోరణితో మరింత నిరంకుశత్వంగా ఉండే నమూనా వైపునకు తీసుకువెళ్తున్నాయి. ఉపా, పి.ఎమ్.ఎల్.ఏ, బి.ఎన్.ఎస్ వంటి పలు కార్యనిర్వాహక, ఆచరణాత్మక చట్టాలు తేవడం ఫాసిస్టు పోకడతో ఉన్న నిరంకుశత్వాన్ని తెలియజేస్తుంది.

ఈ విషయాలన్నిటిని కార్మికులందరి వద్దకూ తీసుకు వెళ్లి ఈ కార్పొరేటు మతతత్వ పాలన దుర్మార్గపు విధానాల దాడులను ఎదిరించాల్సిన అవసరం తెలియజెప్పాలి. కేవలం తాము పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణకే కాక దేశం కోసం, సమాజం కోసం పోరాటం చేయాలని తెలపాలి. ఈ సార్వత్రిక సమ్మె దేశాన్ని కాపాడే పోరాటాల్లో ఒక ముఖ్యమైన భాగమని కార్మికుల దష్టికి తీసుకెళ్లాలి.

నయా ఉదార వాద విధానాలు ప్రారంభమైన నాటి నుండి మన దేశంలోని కార్మిక వర్గం చేసిన వరస సమ్మెల కోవకు చెందిన సమ్మెగా రానున్న సార్వత్రిక సమ్మెను చూడకూడదు. లేబర్ కోడ్‌ల అమలును అడ్డుకోవడం ద్వారా పాలక వర్గం మొత్తం నిరంకుశత్వ విధానాలపై ధిక్కరణ, తిరుగుబాటు చేసే పెద్ద స్థాయి సమరశీల పోరాటాలకు నాందిగా ఈ సమ్మెను అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కోవడంపై కార్మిక వర్గం మరింత చైతన్యంతో చారిత్రక పాత్ర పోషించడానికి, నయా ఉదారవాదంపై పెద్ద స్థాయి ఐక్య ఉద్యమాల నిర్వహణకు ఈ సమ్మె వేదిక నిర్మించాలి.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ మీటింగ్ వెంటనే జరపాలి. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణ ఆపాలి. శ్రమ జీవుల జీవితాలను అతలాకుతలం చేస్తున్న మోడీ పాలనకు నిరసనగా మే 20 సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని న్యూఢిల్లీలో జాతీయ కార్మిక సదస్సు మార్చి 18న జరిగిన జాతీయ కార్మిక సదస్సు తీర్మానించింది. సదస్సు తీర్మానంలో రెండు నెలల పాటు విస్తత ప్రచారం నిర్వహించి ముగింపుగా మే 20న సార్వత్రిక సమ్మె చెయ్యాలని పిలుపునిచ్చింది.

ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సదస్సులో భాగస్వాములయ్యారు. బ్యాంకు, ఇన్స్యూరెన్స్, కోల్, స్టీల్, పోర్ట్ & డాక్, విద్యుత్, టెలికాం, పోస్టల్, రైల్వే, రక్షణ, రోడ్డు రవాణా, విద్య, ఆరోగ్యం, మంచినీరు, పౌర సేవల వంటి రంగాల నుండి, ప్రైవేటు రంగం లోని కాంట్రాక్టు కార్మికులతో సహా అనధికార, అసంఘటిత రంగాలు, పరిశ్రమల్లోని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పీస్ రేట్ లో పనిచేసే స్వయం ఉపాధి కార్మికులు, గహ కార్మికులు, గిగ్ & యాప్ వర్కర్లు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం వంటి స్కీమ్ వర్కర్లు, బీడీ ఇతర నిర్మాణ రంగం, హమాలీల వంటి రంగాల కార్మికులు సదస్సుకు హాజరయ్యారు.

దేశం నలుమూలల రాష్ట్రాల నుండి, రంగాల నుండి హాజరైన కేంద్ర కార్మిక, స్వతంత్ర సంఘాల ప్రతినిధులతో న్యూఢిల్లీ ప్యారేలాల్ భవన్ నిండిపోయింది. బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడంలో ఉన్న ఐక్యతను సదస్సు ప్రతిబింబించింది.

కార్మికుల న్యాయమైన డిమాండ్లను దశాబ్ద కాలం పైగా పెడచెవిన పెట్టిన ప్రభుత్వ నిరంకుశ పాలనను సదస్సు ముక్త కంఠంతో ఖండించింది.

సదస్సుకు కె.హేమలత (సిఐటియు), ఒ.ఎస్.తోమర్ (ఐఎన్టీయూసీ), మోహన్ శర్మ (ఏఐటియుసి), జె.ఆర్ బోస్లే (హెచ్‌ఎంఎస్), విజయ్ పాల్ సింగ్ (ఏఐయుటియుసి), జి.శివశంకర్ (టి.యు.సి.సి), ఆశా బెన్ (సేవా), సంతోష్ రాయ్ (ఏఐసీసీటియు), ఆర్కే మౌర్య (ఎల్‌పిఎఫ్), శత్రుజిత్ సింగ్ (యుటియుసి) అధ్యక్ష వర్గంగా వ్యవహించారు.

తపన్ సేన్ (సిఐటియు), అశోక్ సింగ్ (ఐఎన్టీయూసీ), అమర్జిత్ కౌర్ (ఏఐటియుసి), హర్భజన్ సింగ్ (హెచ్‌ఎంఎస్), హరీష్ త్యాగి (ఏ.ఐ.యు.టి.యు.సి), కె.ఇందు ప్రకాష్ మీనన్ (టి.యు.సి.సి), లతా బెన్ (సేవ), రాజీవ్ దిమ్రి (ఏ.ఐ.సి.సి.టి.యు), జవహర్ ప్రసాద్ (ఎల్.పి.ఎఫ్), అశోక్ ఘోష్ (యు.టి.యు.సి) పాల్గొని ప్రసంగించారు.

కార్మిక సంఘాల ఐక్యవేదిక 17 డిమాండ్లతో కూడిన చార్టర్ ఆఫ్ డిమాండ్లను పరిష్కరించాలని, లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని సదస్సు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మే 20 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చింది.

– తపన్ సేన్, సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి























ముఖం మీద
అందమైన చిరునవ్వు లేకపోతే
అందమైన దుస్తులు వేసుకున్నా
ముస్తాబు పూర్తి కానట్లే.
- గాంధీజీ

అవుట్ సోర్సింగ్ కార్మికుల జీవితాలతో ప్రభుత్వ చెలగాటం



తాడేపల్లిగూడెంలో ఆప్కాస్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు గతంలో వైసిపి పాలనలో పేర్లు మార్చినట్లుగానే ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అదే పనిచేస్తున్నది. ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేటు షాపులకు అనుమతులు ఇచ్చింది. దాంతో 15 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. సచివాలయాల వ్యవస్థను తొలగించి అందులో పనిచేస్తున్న ఉద్యోగులను వారి మాతృసంస్థలకు అప్పగించేందుకు కసరత్తు చేస్తుంది. దీని వల్ల 15,700 మంది మిగులు తేలుతున్నారని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష మందికి పైగా నమోదైన ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు పొరుగు సేవల సిబ్బందిని అప్పగించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వ్యవహారం ఇటు సచివాలయ ఉద్యోగుల్లోనూ, అటు ఆప్కాస్ ఉద్యోగులలోను తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ప్రైవేటు ఏజెన్సీలకు సంబంధించిన అనుభవాలు

ఆప్కాస్ రాకముందు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు మధ్యవర్తి లేదా థర్డ్ పార్టీ ద్వారా నిర్వహించబడేవి. ప్రైవేట్ వ్యక్తులు/సంస్థల ఆధీనంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాలు జరిగేవి. మున్సిపల్ రంగంలో అనుభవాలు పరిశీలిస్తే ఈ సంస్థలు ఏనాడూ సక్రమంగా జీతాలు చెల్లించిందిలేదు. కార్మికులు నెలంతా పని చేసినా ఏదో ఒక రకమైన సాకులతో జీతాలలో కోతలు పెట్టేవారు. పిఎఫ్, ఇఎస్ఐ నిధులు ఆయా ఖాతాలలో సక్రమంగా జమ చేసేవారు కాదు. చట్టబద్ధమైన సెలవులు అమలు జరిగేవి కావు. కార్మికులకు పనిముట్లు ఇచ్చేవారు కారు. ప్రమాదాలకు గురైన కార్మికులను పట్టించుకునేవారు కారు. బకాయి జీతాల కోసం వారాల తరబడి ధర్నాలు, ప్రదర్శనలు, సమ్మెలు చేయాల్సి వచ్చేది. లేబర్ అధికారులకు పిర్యాదులు చేసినా స్పందన వుండేది కాదు. కాంట్రాక్టర్లను/దళారీలను సమస్యల గురించి ప్రశ్నిస్తే సమస్యలు పరిష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు ఒడిగట్టే వారు. వారం-పది రోజులు పని నుండి నిలిపేయడం, లేదంటే ఉద్యోగం నుండి తొలగించేవారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లే కార్మికులకు వడ్డీలకు అప్పులు ఇచ్చి దోచుకుతినే వారు. కార్మికులు నిత్యం అభద్రతలో బతకాల్సి వచ్చేది.

ఆప్కాస్‌తో కార్మికులకు జరిగిన లాభనష్టాలు

గత వైసిపి ప్రభుత్వం రాక ముందు ప్రతి మున్సిపాలిటీలో పారిశుధ్య పనికి ఒకరు, ఇంజనీరింగ్ సెక్షన్ లోని వివిధ విభాగాలకు వేర్వేరు కాంట్రాక్టర్లు వుండేవారు. ఈ కాంట్రాక్టర్ల ద్వారానే కార్మికులకు జీతాలు చెల్లించేవారు. కార్మికులకు ఎదురయ్యే సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళితే మాకు సంబంధం లేదని సమాధానం వచ్చేది. కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సి వచ్చేది.

గత వైసిపి ప్రభుత్వం మున్సిపాలిటీలలో వున్న థర్డ్ పార్టీ ఏజెన్సీలను తొలగించి వాటి స్థానంలో టౌన్ లెవల్ ఫెడరేషన్ (టి.ఎల్.ఎఫ్) లకు అధికారాలు ఇచ్చింది. మరలా టౌన్ లెవల్ ఫెడరేషన్ లను తొలగించి. 2019 ఆగస్టు ఒకటిన ఆప్కాస్‌ను ప్రారంభించింది. ఆప్కాస్ అంటే "ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీస్".

గతంలో ఊరూరా ఉన్న కాంట్రాక్టర్ల వ్యవస్థను తొలగించి ప్రభుత్వమే 'ఆప్కాస్' సంస్థను ఏర్పాటుచేసి ప్రత్యేక సంస్థగా నడుపుతున్నది. దీని ద్వారా కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నారు. ఆప్కాస్ నిర్వహణ నిమిత్తం జీతాల బడ్జెట్ నుండి ఒక శాతం వసూలు చేస్తున్నారు. వివిధ శాఖలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు లక్ష మందిని సభ్యులుగా చేర్చారు. అందులో 45 వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు ఉన్నారు. దీని ద్వారా ప్రతి నెలా 1 లేదా 2వ తేదీనే జీతాలు కార్మికుల అకౌంట్‌కి వస్తున్నాయి. జీతాలలో ఏ విధమైన కోతలు లేవు, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ వాటా నిధులు ఆయా ఖాతాలలో జమ అవుతున్నాయి. కాంట్రాక్టర్ల బెడద లేదు. కనుక కార్మికులకు ఆప్కాస్ వల్ల కొంత భరోసా ఏర్పడింది. అయితే ఆప్కాస్‌లో వీరిని ఉద్యోగులుగా నమోదు చేయడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు కట్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వకుండానే 60 ఏళ్లకు బలవంతంగా రిటైర్మెంట్ చేశారు. అనారోగ్యం పాలయిన లేదా చనిపోయిన వారి స్థానాలలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు.

స్వర్గం చూపిస్తారనుకుంటే నరకంలోకి తోసేస్తున్న కూటమి ప్రభుత్వం

గత మార్చి ఆరవ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేసి పొరుగు సేవల సిబ్బంది నియామకాలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని తీర్మానించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ వార్త మున్సిపల్ కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. కార్మికుల్లో నెలకొన్న భయాందోళనలను మంత్రి డాక్టర్ పి.నారాయణతో పాటు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లనప్పుడు వారు ఖండించలేదు. సాధారణంగా ప్రతి నెల 20వ తేదీ మున్సిపల్ కార్మికుల జీతాల బిల్లులు ఆప్కాస్ సైట్ నుండి తీసుకునే సాంప్రదాయం వుంది. మార్చి నెల బిల్లులు 27వ తేదీ వచ్చినా నేటికీ తీసుకోలేదు. ఈ స్థితిలో మార్చి నెల జీతం ఎప్పుడు వస్తుంది? జీతం ఎవరిస్తారు? అనేది స్పష్టత లేదు. ప్రస్తుతం కార్మికుల్లో గందరగోళం నెలకొంది. కార్మికుల్లో నెలకొన్న ఆందోళనను నివృత్తి చేసి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే.

పర్మినెంట్ చేయాల్సిందే

మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్, పారిశుధ్య పనులన్నీ ఎమర్జెన్సీ సర్వీసు కిందకే వస్తాయి. అంతేకాదు అపాయకరమైనది, ప్రమాదకరమైనది. శాశ్వత స్వభావం కలిగినది. పైగా విష వాయువులను భరిస్తూ ప్రతిరోజూ గంటల కొద్దీ పని చేయాల్సి వుంటుంది. 1971లో ప్రభుత్వం జారీచేసిన కాంట్రాక్టు వర్కర్స్ రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ యాక్టు ప్రకారం కోర్ యాక్టివిటీ (శాశ్వత స్వభావం కలిగిన పని) పని కాంట్రాక్టు (నేరుగా మున్సిపాలిటీ లేదా ప్రభుత్వం జీతాలు చెల్లించే విధానం) లేదా పర్మినెంట్ సిబ్బందితోనే చేయించాలి. మున్సిపాలిటీ పని ఈ కోవకు చెందినదే. అలా చేయించి వుంటే ఎప్పుడో పర్మినెంట్ అయ్యేవాళ్లు. అలాంటి అవకాశాన్ని 2002లో లేకుండా చేస్తూ అంతకు పూర్వం నుండి కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి మార్చింది నాటి తెలుగుదేశం ప్రభుత్వమే. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కార్మికుల్ని కాంట్రాక్టు లేదా పర్మినెంటులోనో కాకుండా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించి కార్మికులకు అన్యాయం చేశాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోరాటం ఫలితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిఆర్‌సి జీతాలు, డిఎ, ఐఆర్ చెల్లించినప్పుడు మున్సిపల్ కార్మికులకు కూడా ఇవి చెల్లించాలని, జీఓఆర్‌టి నెంబర్ 1615లో పేర్కొన్నారు. అలాగే 2015లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పర్మినెంట్ వారితో సమానంగా పని చేస్తున్న డైలీ వేజ్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ తదితర పేర్లతో పని చేసే వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పింది. 2018లో విభజిత ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా టైమ్ స్కేల్ జీతాలు 2019 జనవరి నుండి చెల్లిస్తామంటూ జీ.ఓ.ఆర్.టి నెంబర్ 96ను ప్రభుత్వం జారీ చేసింది. అయినా ప్రభుత్వాలు ఇవేవీ నేటికీ అమలు చేయలేదు.

ఏటేటా పట్టణాలు విస్తరిస్తున్నాయి. ఘన, ద్రవ వ్యర్థాల పరిమాణం పెరుగుతుంది. అందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచడం లేదు. ఈ నాటికీ అనేక పట్టణాలలో కోవిడ్, బదిలీ, ఎన్.ఎం.ఆర్ వంటి పేర్లతో కనీసం వేతనం రూ.21,000 ఇవ్వకుండా రూ.4 వేల నుండి రూ.12,000 మధ్య చెల్లిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులు చేసే పని ఇతరులు ఎవరూ చేయలేరని పాలకులందరూ పొగుడుతుంటారు. ప్రమాదకరమైన కరోనా సమయంలో 'ఫ్రంట్‌లైన్ వారియర్స్' అని పేరుపెట్టి పని చేయించుకుని చేతులు దులిపేసుకున్నారు. గతంలో విశాఖ హుదూద్ తుఫాన్, ఇటీవల విజయవాడ వరదల్లో కనీసం తిండి పెట్టకుండా, కనీస వసతులు కల్పించకుండానే వెట్టి చాకిరీ చేయించారు. ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. కనుకనే పర్మినెంట్ చెయ్యాలని కోరుతున్నారు. వీరి న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి తోడ్పడాలని కోరుతున్నారు.

- కె.ఉమామహేశ్వరరావు



పిల్లల ఇష్టంతోనూ, వారి మేధస్సుతోనూ, వారిలో పెరుగుతున్న చైతన్యంతోనూ సంబంధం లేకుండా వారిపై ఒక ముందస్తు లక్ష్యాన్ని రుద్దే విధంగా పాఠశాలలు వుండకూడదు. పాఠశాలల్లో వారికి స్వేచ్ఛ వుండాలి. స్వేచ్ఛగా సృజన చేసే అవకాశం వుండాలి. అంతేగాని అవి బానిసత్వంతో కూడిన, యాంత్రికమైన ఖచ్చిత లక్ష్యాలు సాధించే విధంగా వుండకూడదు.

- ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త.



అరుణ పతాక తారకు.. జేజేలు

నేడు సుందరయ్య జయంతి

మేడే....ఓ మహత్తర పోరాటం పురుడుపోసుకున్న రోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు రక్తం చిందించిన రోజు. అంతేకాదు ఓ అరుణతారను శ్రామికులకు, కష్టజీవులకు అందించిన రోజు. 18వ శతాబ్దంలోనే యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణను ప్రారంభించిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు....శ్రామిక ప్రజల శ్రమశక్తిని నిలువెల్లా దోచుకున్నారు. ఇందుకోసం శ్రామికులకు అమానుష శిక్షలు వేయడం.. చివరకు కొట్టి చంపడం వంటి క్రూరాతి క్రూరమైన చర్యలకు తెగబడ్డారు. ఈ నేపథ్యంలో 1886 మేలో అమెరికా దేశం చికాగో నగరంలోని హే మార్కెట్లో సమ్మె చేస్తున్న నలుగురు కార్మిక నేతలను పెట్టుబడిదారులు కాల్చి చంపారు. మే 4న మరో నలుగురు కార్మికులను కోర్టులో విచారించి 1887 నవంబర్ 11న నిర్దాక్షిణ్యంగా ఉరివేసి చంపారు. దీంతో కార్మిక లోకం ఉవ్వెత్తున ఎగసింది. శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన అరుణ పతాకం రెపరెపలాడింది. అదే నేటికీ దోపిడీకి గురువుతున్న శ్రామికులకు, కార్మికులకూ వెలుగు దిక్సూచిగా ఉంది. అలాగే కార్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మే డే రోజునే (1913 మే 1న) దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారత దేశ కార్మికవర్గ పార్టీ అగ్రనేత, పేదల పెన్నిధి, మహోన్నత నేత పుచ్చలపల్లి సుందరయ్య గారు జన్మించారు. ఆ మహానేత జయంతినీ శ్రామికులు, కార్మికులు...యావత్ ప్రజానీకం జరుపుకుంటూ స్ఫూర్తి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే మే డే దీక్షా దినానికి ఎంతో ప్రత్యేకత ఉంది.

ప్రతి మనిషికి మరణం వుంటుంది కానీ... మానవత్వానికి కాదు.

- మదర్ థెరిసా



నలుగురూ నడిచే దారిలో నడవడం క్షేమం అనుకుంటారు అందరూ. అందుకే అన్ని విషయాల్లోనూ మూస పద్ధతులను అనుసరిస్తారు. వాటిని వదిలేసి సొంత ఆలోచనలతో ముందుకు వెళ్తూ ఆదర్శంగా నిలిచేవాళ్లు చాలినంత మంది సమాజంలో కనపడరు. అందుకే సంఘసంస్కరణకి శతాబ్దాలు పడుతుంది.

- రాహుల్ సాంకృత్యాయన్, ప్రఖ్యాత రచయిత



ప్రభుత్వ బడి

'ప్రపంచాన్ని మార్చడానికి మీరు ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అంటారు నెల్సన్ మండేలా. సమాజ పురోగమనంలో విద్య యొక్క కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. భారతదేశంలో మితవాద ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానం జాతి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోంది. నయా ఉదారవాద విధానాల పుణ్యమా అని సమాజంలో ఎక్కువ మందికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది. 'ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు అందరూ ఉద్యమించాలని, విద్య అందరికీ చేరువైతేనే సామాజిక న్యాయం దక్కుతుందని, మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచకపోగా, రేషనలైజేషన్ పేరుతో పెద్దయెత్తున ప్రభుత్వ స్కూళ్లు మూసివేసేందుకు రాష్ట్రప్రభుత్వం యత్నిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచే ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో ఉంచేటట్లు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ పిలుపునివ్వడం అత్యంత సముచితం. 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' అన్న నినాదం ఊపందుకోవాలి.

ప్రభుత్వ పాఠశాల అంటేనే... చిన్నచూపు. ఉన్నతమైన చదువులు చదవాలంటే కార్పోరేట్ పాఠశాలలు, కాలేజీలే మేలన్న అపోహతో కొందరు ఎల్‌కెజీ నుంచే లక్షలు ఖర్చుచేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49 శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, ప్రైవేట్ బడుల్లో చదివేవారి సంఖ్య 51 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021 ఏప్రిల్ నాటికి ప్రభుత్వ లెక్కల ప్రకారం... ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 44,54,038. జీవో 117 పేరుతో పాఠశాలల సంఖ్యను కుదించిన తర్వాత...కచ్చితమైన లెక్కలు బహిర్గతం కావడంలేదు. ఉపాధ్యాయ సంఘాలు సేకరించిన సమాచారం మేరకు 1, 2 తరగతులు మాత్రమే నిర్వహించే బడులు 4600 వుంటే, దానిలో 20లోపు ఎన్‌రోల్‌మెంట్ ఉన్న బడులు 2,730. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల పైచిలుకు ఉంటే... 20 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు 8,900 వరకు ఉన్నాయి. సుమారుగా 12,000 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించిన వివరాలు ప్రభుత్వం అధికారికంగా ఎక్కడా వెబ్‌సైట్‌లో పెట్టలేదు. కానీ, 36 లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం లేదని లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ బడుల్లో పెద్దఎత్తున ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, తగినన్ని మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల విద్యలో నాణ్యత పడిపోతోంది. దీంతో ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. విద్యార్థులు తగినంత మంది లేరన్న సాకుతో ప్రభుత్వం వీటిని మూసివేస్తోంది. ఇదంతా విద్య ప్రైవేటీకరణకు ప్రభుత్వం ఆడుతున్న నాటకం.

తల్లిదండ్రులు సైతం... ప్రభుత్వ బడుల్లో చదువు చెప్పే ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించడం లేదు. ప్రభుత్వం బడి పట్ల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పిల్లలందరికీ నాణ్యమైన విద్య ఆ యా తరగతిలో సామర్థ్య ఆధారిత బోధన అందిస్తామనే భరోసాను, నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలిగించాలి. పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటిస్తూనే... ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలి. అంతేకాదు, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు తల్లిదండ్రులను, విద్యావేత్తలను కలుపుకుని ఒక ఉద్యమంగా కదలాలి. నాణ్యమైన విద్యకు ప్రాధాన్యమివ్వడంలో కేరళ దేశంలోనే ప్రథమ స్థానంలో వుంది. విద్యపై చేసే ఖర్చును భావితరాల భవితకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. ఇలా నాణ్యమైన విద్య అందించడమన్నది ప్రభుత్వ అజెండాగా వుండాలి. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే ఎజెండాగా పెట్టుకున్నాయి. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారానే సమాజంలో అందరికీ విద్య అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ బడి అమ్మ ఒడిలా మారాలి. ప్రతి చిన్నారీ బడి మెట్లెక్కాలి. అప్పుడే ప్రభుత్వ విద్య లక్ష్యం సాకారమౌతుంది. నైతిక, రాజ్యాంగ విలువలు పరిరక్షించబడతాయి.









సొంత లాభం కొంత మానుకొని!

సమాజ సేవలో డాక్టర్ నిరీక్షణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సొంత లాభం కొంత మానుకో, పొరుగు వాడికి సాయపడవోయ్ అన్న గురజాడ మాటలను వంటపట్టించుకున్నారు ఆయన. పేద తరగతి కుటుంబ నేపథ్యం వల్ల పలు కష్టాలను అనుభవించి ఉన్నత స్థాయిలో స్థిరపడినా ఆలోచనల వేగం మాత్రం సేవాబాటను వీడలేదు. ఎవరి పను వారు చేసుకుని హాయిగా కుటుంబంతో గుడుపుతూ ఆస్తులను పెంచుకుంటున్న ఈ రోజుల్లో కొందరూ మాత్రం నిస్వార్థంగా నలుగురికి సహాయం చేస్తూ ఆపదలో ఉన్న వారికి తామున్నామని గుర్తు చేస్తుంటారు. అందులో ఆయన ఒకరు. కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ దొడ్డి నిరీక్షణరాజు స్వతహాగా మృదు స్వభావి. సమాజ సేవకుడిగా, అంబేద్కర్ వాదిగా, తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, లేబర్ కాంట్రాక్టర్‌గా రాణిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థితికి ఎదిగారు డాక్టర్ నిరీక్షణరాజు. విద్య, సాహిత్య, సాంస్కృతిక, కళ, ఆధ్యాత్మిక, సామాజిక చైతన్య రంగాల్లో ఆయన అందిస్తున్న నిరుపమాన సేవలు బహు ప్రశంసనీయమని, ప్రతిఒక్కరూ నిరీక్షణ రాజును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రశంసిస్తున్నారు. తన సంపాదనలో కొంతైనా సామాజిక సేవకు, ఆధ్యాత్మికంగా వెచ్చించడం, కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించడం ఆయన సంకల్పం. ఆక్వా కార్మికులకు, పేదలకు సాయం చేస్తున్నారు. గత 17 ఏళ్లుగా ఆక్వా రంగంలో రాణిస్తున్నారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తన వంతు సాయంగా కూరగాయలు పంపిణీ చేస్తున్నారు. కోపల్లె గ్రామంలో అంబేద్కర్ జయంతి, వర్థంతి వేడుకలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. పేదలకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే వందల కార్మికులకు కరోనా మొదటి, రెండు దశల్లో రూ.లక్షల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు.



సమాజ సేవ చేయడమే నా లక్ష్యం

డాక్టర్ డి.నిరీక్షణరాజు, కోపల్లె

సమాజంలో ప్రతిఒక్కరూ సామాజిక సేవలో పాల్గొనాలి. సంపాదించినదానిలో కొంత సామాజిక సేవకు నిరంతరం కొనసాగించాలన్నదే నా ఆకాంక్ష. భీమవరం, ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఆక్వా కార్మికులకు, పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నాను. ఎన్ని కష్టాలు ఎదురైనా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాను. కోపల్లెలో చర్చి నిర్మాణానికి సహకారం అందిస్తున్నాను.